హైదరాబాద్ వార్త



# మీసేవల్లో సర్వర్‌డౌన్..

-గత నెలరోజులుగా అదేతంతు
-అప్లికేషన్స్ ఎంటర్ చేయగానే ఎర్రర్ ఆప్షన్
-సమస్య ఏంటో తెలియదంటున్న నిర్వాహకులు
-రోజుల తరబడి తిరుగుతున్నామని దరఖాస్తుదారుల ఆవేదన



హైదరాబాద్,ఏప్రిల్ 24,ప్రభాతవార్త: నిత్యం వేలాది మంది వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ కేంద్రాలకు వెళ్తుంటారు. ప్రధానంగా ఆదాయ, కుల, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతోపాటు పోటీ పరీక్షలకు దరఖాస్తు సమర్పిస్తుంటారు. గతకొద్దిరోజులుగా సర్వర్‌డౌన్ కావడంతో మీ సేవ కేంద్రాలు నిలిచిపోగా, డాక్యుమెంట్ల కోసం వేలాది మంది ప్రజలు అవస్థలు పడుతున్నారు. గంటల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండడంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మూటేషన్ దరఖాస్తు కొరకు పంజాగుట్టలోని ఓమీసేవా కేంద్రానికి వెల్లగా సర్వర్‌డౌన్ అని వచ్చింది. మరుసటి రోజు మరో మీసేవాకేంద్రానికి వెల్లగా ఇదే పరిస్థితి. దీంతో మీసేవలతీరుపై దరఖాస్తు దారులు మండిపడ్డారు. సుమారు 40 రకాల సేవలందిస్తున్న మీ సేవ కేంద్రాలు ఇప్పుడు ఆ సేవలందించలేకపోతున్నాయి. ఓ వైపున కొన్ని స్కాలర్ షిప్ దరఖాస్తులకు చివరి తేదీ ముగుస్తోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూ సంబంధిత రికార్డులు, ఇతరాత్ర అవసరాల కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్తున్న వారికి నిరాశే ఎదురవుతోంది. కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బంది పడుతుండగా ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు రెవెన్యూ కార్యాలయాల నుంచి తీసుకోవాల్సిన ధ్రువీకరణ పత్రాలు కూడా తీసుకునే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజు ఉదయం, సాయంత్రం మీ సేవల చుట్టూ తిరగడమే సరిపోతుందని, దయచేసి సర్వీసులు ఎప్పుడు మొదలవుతాయో చెప్పాలని బాధితులు వేడుకుంటున్నారు.

**సమస్య ఏంటో తెలియదంటున్న నిర్వాహకులు**

సర్వర్‌లో లోపాలు తలెత్తాయని, అప్‌డేట్ చేసే పనిలో యంత్రాంగం నిమగ్నం అయినట్టుగా అంచనా వేసుకోవడం తప్ప ఎవరూ సమాచారం ఇవ్వడంలేదని దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. అప్లికేషన్ డేటా ఎంటర్ చేసిన తర్వాత ఎర్రర్ వస్తోందని ఒక్కొక్క అప్లికేషన్ ఎన్నిసార్లు డేటా ఎంట్రీ చేయమంటారని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సర్వీసును మీసేవకు అనుసంధానించిన అధికారులు సమస్య ఏమిటో చెప్పకపోవడంతో దరఖాస్తుదారులతో చీవాట్లు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. ఎప్పటిలోగా పునరుద్దరిస్తారో తెలిస్తే మీసేవ కేంద్రాలు మూసేస్తామని నిర్వాహకులు అంటున్నారు.

**మూటేషన్ మూలకే..**

మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసిన 15 రోజుల్లోనే మ్యుటేషన్ వ్యవహారం కొలిక్కి రావాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మీసేవ కేంద్రంలో దరఖాస్తు సహా సేల్ డీడ్, 1బీ, పహాణీ నకలు జతపరిస్తే.. వాటిని డౌన్లోడ్ చేసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించి.. భూ యాజమాన్య హక్కుల మార్పిడి ప్రక్రియను పూర్తి చేయడం రెవెన్యూ అధికారుల విధి. అయితే క్షేత్రస్థాయిలో ఇది అమలు కావడం లేదు. ఒకవైపు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలంటే సర్వర్‌డౌన్ అని వస్తుంది. అలాగే మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసిన కాపీల నకళ్లను తహసీల్దార్ కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేస్తే తప్ప వాటికి మోక్షం కలగడంలేదు.

# ఉగ్రదాడి ఘటనతో నగరం అప్రమత్తం

**- కీలకప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం -అనుమానస్పద వ్యక్తులపై పోలీస్ నిఘా**



హైదరాబాద్,ఏప్రిల్24, ప్రభాతవార్తః జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి ఘటనతో నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కేంద్ర నిఘా సంస్థ, రాష్ట్ర ఇంటలిజెన్స్ ఆదేశాల మేరకు అడుగుడుగున మరింత నిఘా పెంచారు. ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు అయిన భారత్ సమ్మిట్, మిస్‌వరల్డ్‌లు ఉండడంతో భారీబందోబస్తుతో పటిష్ట చర్యలు చేపట్టనున్నారు. కేంద్ర హెచ్చరికలతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్‌రెడ్డిలు పోలీస్ ఉన్నతాస్థాయి అధికారులకు సూచనలు చేసింది. ఇప్పటికే సమస్మాత్మక ప్రాంతాల్లో అనుమానస్పదంగా సంచారిస్తున్న వారిని తనిఖీ చేస్తూ వివరాలను రాబడుతున్నారు. కీలకప్రాంతాల్లో నిఘాను పెంచారు. పాతబస్తీతో పాటు ఆయా సున్నిత ప్రాంతాల్లోనూ డేగకళ్లతో పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా ప్రధానరహదారుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

**వాహనాల రాకపోకలపై నిఘా...**

ప్రైవేటు వాహనాల రాకపోకలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతపరంగా లగేజీలను అనుమానస్పదంగా కనిపించిన వాటిని సైతం పరిశీలిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు ముందు చూపుతో అన్ని కోణాల్లో భద్రత చర్యలు చేపడుతున్నారు. ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు, పార్కులు , ఆయా రైల్వేస్టేషన్లు, జూబ్లీ బస్టాండ్, ఎంజీబీఎస్ తదితర చోట్ల నిఘాపెంచారు. అదేవిధంగా జిల్లాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, తచ్చాడుతున్న వ్యక్తులను ఆరా తీస్తున్నారు.ఇక అర్ధరాత్రి దాటేవరకు తెరిచి ఉన్న దుకాణాలు, హోటళ్లపై ఆంక్షలు విధించారు. గతంలో తలదాచుకున్న ఉగ్రదాడుల ఘటనల ఆధారంగా ఇక కలాపాలన్ని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యేలా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇతర వ్యక్తులైతే ముఖ కదలికలు, సంభాషణలు స్పష్టంగా ఉండాలని పోలీసులు చెబుతున్నారు.

**అనుమాన వస్తువులపై గురి..**

నగరంలో రోడ్లపై ఉంటున్న పాత పరికరాలు, డబ్బాలు, పార్కింగ్ చేసిన పాతబడిన కార్లు ఇలా ప్రతివాటిని పోలీసులు జల్లెడపడుతున్నారు. యాకుత్‌పుర, మలక్‌పేట, బహదూర్‌పూర, చార్మినార్ పరిసర ప్రాంతాలతో పాటు సికింద్రాబాద్, విదేశీలయులు ఉండే సైబరాబాద్ పరిధిలో తనిఖీలు చేస్తున్నారు. అదేవిధంగా ఉగ్రమూలాలు ఉన్న నేరస్తులపై దృష్టిసారించారు.

# నేడే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

-జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాట్లు
-ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభం
-రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్వో అనురాగ్ జయంతి, ఎన్నికల పరిశీలకులు సురేంద్ర మోహన్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 24,ప్రభాతవార్త: హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, ఓట్ల లెక్కింపునకు సంబంధించి అవసరమైన భద్రతా ఏర్పాట్లు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు సురేంద్ర మోహన్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. బ్యాలెట్ బాక్స్‌ల భద్రత, వీడియో రికార్డింగ్, సెక్యూరిటీ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపుకు ప్రత్యేక కౌంటింగ్ టేబుల్స్, సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. కాగా బుధవారం జరిగిన ఓటింగ్‌లో మొత్తం 112 ఓట్లకుగానూ 88ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్, బిజెపి, ఎంఐఎం నేతలు తమ ఓటుహక్కు వినియోగించుకోగా బిఆర్ఎస్ నుంచి 24మంది సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.

# సుర్రుమంటున్న సూర్యుడు

హైదరాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. మొన్నటి వరకు వర్షాలతో కాస్త తెరిపినిచ్చినా, ఉదయం నుంచి సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి.రానున్న రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.గురువారం 40డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొంటున్నారు.ఉదయం 10 నుంచి 4 గంటల వరకు ప్రజలు బయటకు రాకుంటే మంచిదని సూచించింది. అత్యవసరం ఉంటేనే ప్రజలు మధ్యాహ్నం బయటకు రావాలంది. రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. శనివారం కొన్ని జిల్లాల్లో మెరుపులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే వీలుందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.వీలైనంత ఎక్కు నీరు తాగాలని, శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలని వివరించారు. జిమ్‌లు, అవుట్‌డోర్‌లలో వ్యాయామం చేసేవారు కూడా జాగ్రత్తగా ఉండాలి. డీహైడ్రేషన్ ఇతర పరిస్థితులు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని వారు హెచ్చరిస్తున్నారు. మండుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.




ముషిరాబాద్ ప్రాంతంలో త్రాగేపైపులైన్ నుండి వస్తున్న నీటితో ముఖం తడుపుకుంటున్న వృద్ధుడు

# చంచల్‌గూడ మహిళా జైలును సందర్శించిన నేరెళ్ల శారద



చంచల్‌గూడ మహిళా జైలు వద్ద మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద

సైదాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త: చంచల్‌గూడ మహిళా జైలును రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద గురువారం ఆకస్మికంగా సందర్శించారు. జైలులో ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, బ్యారక్‌లు, ములాకత్‌లు, జైలు అడ్మినిస్ట్రేషన్ తదితర వివరాలను పరిశీలించారు. అనంతరం జైలు బయట మహిళా కమీషన్ చైర్ పర్సన్ శారద మీడియాతో మాట్లాడుతూ జైలులోని మహిళా ఖైదీలతో తాను మాట్లాడడం జరిగిందని, ఒక్కొక్కరు ఒక్కో రకమైన కారణంతో జైలుకు రావడం జరిగిందన్నారు. జైల్లోని టాయిలెట్స్, కిచెన్, ఖైదీలు పనిచేస్తున్న స్థలాలతో పాటు అన్ని చోట్లను పూర్తిగా పరిశీలించడం జరిగిందన్నారు. ప్రతి మహిళా ఖైదీతో మాట్లాడి వారి మానసిక పరిస్థితిని తెలుసుకోవడం జరిగిందన్నారు. పత్యేక సెల్‌లో ఉంచిన అఘోరితో కూడా మాట్లాడడం జరిగిందన్నారు. సత్ప్రవర్తన వైపు వెళ్లేలా ఖైదీలకు ప్రతిరోజు కౌన్సిలింగ్ ఇస్తున్నారని, డిప్రెషన్‌కు లోనైన వారిని బయటకు తీసుకురావడానికి సూపరింటెండెంట్‌తో పాటు ఇతర సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఖైదీలు ఒంటరి అనే భావన లేకుండా తమ కటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నామన్న విధంగా భావిస్తున్నారని అన్నారు. ఖైదీల ఆరోగ్యానికి అనుగుణంగా వారికి అహారం అందిస్తున్నారని అన్నారు. జైలు నుంచి విడుదల అయిన తర్వాత సొసైటీలో తమ కాళ్లపై తాము నిలబడేలా స్వయం ఉపాధి కోసం వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వం నుంచి, మహిళా కమీషన్ నుంచి ఎలాంటి సహకారం అయినా అందించడానికి సిద్దంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ టి.వి. లక్ష్మి శ్రీనాద్, మహిళా కమీషన్ కార్యదర్శి బి.పద్మజ రమణ, సెక్షన్ ఆఫీసర్లు విజయభారతి, డి.అరుణ, సిహెచ్ సునిత, నిత్య, పిఎస్ సాదియా రుక్సానా తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా విక్రయిస్తున్న గంజాయి స్వాధీనం



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కొంపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

మానవాళి మనుగడకు విఘాతం కలిగిస్తున్న గంజాయిని నియంత్రించేందుకు పోలీసులు అనేక రకాల చర్యలు తీసుకుంటున్నా, మరోపక్క యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వస్తుండంతో గంజాయి అమ్మకందారులు బాగా పెరిగిపోయారు. గంజాయిని పలు రకాలుగా అక్రమంగా విక్రయిస్తున్నారు. కాగా గురువారం పోలీసులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం సాయంత్రం 6గంటలకు మేడ్చల్ జోన్, దుండిగల్ పోలీసుల ప్రత్యేక ఆపరేషన్ బృందం ఎస్‌ఓటి అధికారులు దుండిగల్ సమీపంలోని ఓఆర్ఆర్ సమీపంలో షేక్ మునావర్ (24), గంటసాల జగదీష్ (19) అనే ఇద్దరు మాదకద్రవ్యాల పెడ్లర్లను అరెస్టు చేశారు. మరో వ్యక్తి దేవా అలియాస్ సచిన్ పరారిలో ఉన్నాడు. గంజాలోని సుక్మా ఆఫ్ ఒడిషా నుండి తెలంగాణ రాష్ట్రం మీదుగా కర్ణాటకలోని గుల్బర్గ్‌కు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు మాదకద్రవ్యాల పెడలర్లను పట్టుకున్నారు. వారి వద్ద నుండి 94 కిలోల గంజాయి, 1 మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ. 33,00,000 వరకు ఉంటుందని తెలిపారు. మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి ఐపీఎస్ పర్యవేక్షణలో మేడ్చల్ డీసీపీ ఎస్‌ఓటీ, మేడ్చల్ డీసీపీ ఎ. విశ్వ ప్రసాద్, మేడ్చల్ డీసీపీ ఎస్ఓటీ , మేడ్చల్ అదనపు డీసీపీ బి. శ్రీనివాస్ రెడ్డి, ఏసీపీ మేడ్చల్ ఎస్‌హెచ్‌ఓ పి. సతీష్, దుండిగల్ ఎస్‌హెచ్‌ఓ ఆర్. శ్యామ్ సుందర్ రెడ్డి, ఎస్ఓటీ మేడ్చల్ పోలీస్ ఇన్స్పెక్టర్, మేడ్చల్ బృందం నిందితులను పట్టుకోవడంలో అపారమైన కృషి చేశారని, సైబరాబాద్ ఎస్పీ, సైబరాబాద్ ఎస్‌ఓటీ మేడ్చల్ బృందం సిబ్బంది కృషిని అభినందించారు. మాదకద్రవ్యాల సరఫరాదారులకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100 ద్వారా లేదా సైబరాబాద్ ఎన్‌డిపిఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్: 7901105423 లేదా సైబరాబాద్ వాట్సాప్ నంబర్: 9490617444 ద్వారా తెలియజేయాలని ప్రజలను అభ్యర్థించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు.

## భూ భారతితో భూముల సమస్యలన్నీ పరిష్కారం

**- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**




ఖానాపూర్ గ్రామంలోని రైతు వేదికపై "భూ భారతి" చట్టం-2025పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

నార్సింగి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం అత్యంత పకడ్బంధీగా తీసుకు వచ్చిన "భూ భారతి చట్టం"తో భూముల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం గండిపేట మండల పరిధిలోని ఖానాపూర్ రైతు వేదికలో భూ భారతి చట్టం-2025పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న చట్టాలు లోపభూయిష్టంగా ఉండడంతో చాలా వరకు భూముల రికార్డులు ఆన్‌లైన్‌లో కనిపించలేదన్నారు. దాంతో భూముల విషయంలో అవకతవకలు జరిగాయని, రికార్డుల్లో ఒకరి పేరుంటే, సాగు చేసేది మరొకరు ఉండేవారని, దీంతో ఇరువురూ పోట్లాడుకోవడం, కోర్టులకు వెళ్లడం జరిగిందన్నారు. అవినీతికి తావు ఇవ్వకుండా, నిజమైన భూ యజమానులకు అన్యాయం జరుగకుండా ఉండేందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పకడ్బంధీగా " భూ భారతి " చట్టంను అమలు చేస్తున్నారన్నారు. భూ భారతి చట్టం ప్రకారం చాలా వేగంగా భూ బదులాయింపులు జరుగుతాయన్నారు. అవినీతికి, అవకతవకలకు అవకాశం లేకుండా చలా పకడ్బంధీగా దశాబ్దాల పాటు భూములపై అవగాహన ఉన్న, నిష్ణాతులైన అధికారులతో భూ భారతి చట్టంను అమలు చేస్తున్నారన్నారు. ఈ చట్టం రాకతో ఇక భూ వివాదాలన్నింటికి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావంను వ్యక్తం చేశారు. రైతుల భూములకు పటిష్టమైన రక్షణ ఉంటుందన్నారు. ప్రతీ రైతు భూ భారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. నూతన ఆర్ఓఆర్ చట్టం ద్వారా వివాదాలన్నింటికి చెక్ పెట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, సహకార సంఘం చైర్మన్లు రాందాస్ ముదిరాజ్, టి.కృష్ణ, మాజీ సర్పంచ్‌లు గండయ్య ముదిరాజ్, రామేశ్వరం నర్సిహ్మా, మాజీ కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘరానా నేరస్తుడి చేతివాటం

-రూ.11.50లక్షలు,బంగారం దొంగిలించి పరారీ
- నిందితుడిని పట్టుకున్న పోలీసులు



కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

గతంలో 44 కేసుల్లో నిందితుడిగా వుండి తాళం వేసిఉన్న ఇంటిలోనుండి సుమారు 12తులాలబంగారం ఆపహరించి తప్పించుకుని తిరుగుతున్న ఘనానా నేరస్తుడిని జీడిమెట్ల పోలీసులు ఎట్టకేలకు పట్టుకుని కొత్తుస్వాదీనం చేసుకున్నారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆధ్వరయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జీడిమెట్ల డిటెక్ట్యూ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ కనకయ్య, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ రాజు, సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌ల ఆధ్వర్యంలో వివరాలను వెల్లడించారు. ఈనెల ఆరవతేదిన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అపురూపా కాలనీలోని బెంగాళీలకు చెందిన ఇంట్లో తాళాలు పగలగొట్టి భారీగా దొంగతనం జరిగింది. అప్పటినుండి పోలీసులు నిరంతర నిఘాద్వారా మొత్తం చుట్టుపక్కల గల 160సిసి పుటేజీలను పరిశీలించి నేరాన్ని పాత నేరస్థులైన బ్యాగరి వేణుకుమార్(26)సంపత్‌సాయిలు ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. వివిధకోణాల్లో పరిశోధించి నేరస్థుడు గాజులరామారం పరిసరాల్లో సంచరిస్తున్నట్లు తెలుసుకుని గురువారం అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలలో మొత్తం44 కేసుల్లో నిందితులుగా వుండటంతో పాటు దుండిగల్‌లోని ఒక కేసులో అరెస్టుఅయి సంవత్సరకాలం జైలుకు వెళ్లివచ్చినట్లు నిర్థారించారు. వీరిద్దరు జీడిమెట్ల, బాచుపల్లి, ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలలో పలు నేరాల్లో నిందితులుగా వున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈసందర్భంగా జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ మాట్లాడుతూ నేరస్థులు ఎంతటి తెలివిగల వారైనా సిసి కెమెరాల సహాయంతో పట్టుకోవడం సులభమయిందని ఆయన తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘాలు, వ్యాపారులు విధిగా తమతమ ప్రాంతాలలో సిసి కెమెరాల ఏర్పాటుకు వ్యక్తిగతంలో చొరవచూపాలని విజ్ఞప్తిచేశారు. దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నేరస్థులలో బ్యాగరి వేణుకుమార్ పోలీసులకు చిక్కగా మరో నేరస్థుడు సంపత్‌సాయి తప్పించుకున్నాడని ఇతనిని కూడా పట్టుకునేందుకు ప్రత్యేక బలగాలు గిలిస్తున్నాయని జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఆదేశాలమేరకు బాలానగర్ డిప్యూటీ పోలీసు కమిషనర్ కె.సురేశ్‌కుమార్, బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ హానుమంతరావుల సూచనల మేరకు దొంగలను పట్టుకునేందుకు నేరస్తులను పట్టుకునేందుకు యత్నించినట్లు తెలిపారు. నేరస్తుల ఆచూకీకోసం నిరంతరం కృషిచేసిన వారికి ఉన్నతాధికారులతో అవార్డులను, రివార్డులను అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు. సమావేశంలో జీడిమెట్ల డిటెక్ట్యూ సర్కిల్‌ఇన్స్‌పెక్టర్ కనకయ్య, బాలానగర్ సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ రాజు, డిటెక్ట్యూ సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్యామ్, పోలీసులు రాజశేఖర్, సుబ్బారావు, ఆంజనేయులు, రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## బిసిసిఐ అండర్ 19కు హైదరాబాద్ సిటీ గర్ల్స్ అరుదైన స్థానాన్ని దక్కించుకున్న ఏడుగురు అమ్మాయిలు

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** బీసీసీఐ నిర్వహించనున్న క్రికెట్ అండర్ 19 ఎలైట్ శిబిరాలకు హైదరాబాద్ నగరానికి చెందిన ఆరుగురు అమ్మాయిలు స్థానం దక్కించుకున్నారు. ఒకే సారి సిటీ చెందిన ఆరుగురు అమ్మాయిలు జాతీయ స్థాయి క్రికెట్ జట్టుకు ఒకే సారి ఎంపిక కావటం ఇదే మొదటి సారి. హైదరాబాద్ నగరం గర్వించదగిన విషయం. ఎంపికైన వారిలో కే.నిధి, సంధ్య గోరా, కావ్యశ్రీ, జాస్మిన్ గిల్, పీవీ హంసకి, సీపీ పార్వతి, ఈ.శృజన అనే సిటీ క్రికెట్ ప్లేయర్లు త్వరలోనే జట్టుఏ గా రాంచీలో జరగనున్న శిబిరంలో శిక్షణకు నిధి, సంధ్య , కావ్యశ్రీలు, కాగా, టీమ్ డీలో డెహ్రాడూన్ లో నిర్వహించే శిక్షణకు హంసిక, పార్వతి, సృజన, టీమ్‌బీలో భాగంగా అహ్మదాబాద్ లో నిర్వహించే శిక్షణ శిబిరానికి జాస్మిన్ గిల్ హైదరాబాద్ నుంచి బీసీసీఐ అండర్ 19 క్రికెట్ శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. ఆయా వేదికల్లో శుక్రవారం ఏప్రిల్ 25 నుంచి మే 21 వరకు శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. శిక్షణ ముగిసిన తర్వాత ఈ యువ క్రీడాకారిణులు జాతీయ స్థాయి వేదికలపై తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.

## బయోలాజికల్ ఇ,దాట్ల ఫౌండేషన్ సేవలు అనిర్వచనీయం



సర్టిఫికెట్లు అందిస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో బయోలాజికల్ ఇ, దాట్ల ఫౌండేషన్‌ల సేవలు చిరస్మరణీయమని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్ నాథ్ పేర్కొన్నారు. మచ్చబొల్లారంలో జిహెచ్ఎంసి మరియు బయోలాజికల్ ఇ, దాట్ల ఫౌండేషన్ సంయుక్త అద్వర్యంలో ఫార్మా ఇండస్ట్రియల్ ట్రైనింగ్, డిజిటల్ కమ్యూనికేషన్, ల్యాబ్ ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ అంశాలులో ఉచితంగా యువతీ యువకులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. ఇందులో బాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు కార్పొరేటర్‌తో పాటుగా డిసి శ్రీనివాస్ రెడ్డి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. సామాజిక సేవలో బాగంగా బయోలాజికల్ ఇ, దాట్ల ఫౌండేషన్‌లు ద్వారా శిక్షణ పొందిన వారిలో 70 శాతం మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటుగా మరో 30 శాతం వారికి స్వయం ఉపాధి కోసం దారులు చూపడం జరిగిందని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. కార్పొరేటర్ సంస్థలు ఇటువంటి సేవా కార్యక్రమాలులో విరివిగా పాలు పంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దాట్ల ఫౌండేషన్ ఆర్గనైజర్ కృష్ణ చైతన్య కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి : సాయి కిరణ్

**చార్మినార్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో జరగనున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ కోరారు.బహదూర్‌పుర నియోజకవర్గం కిషన్‌బాగ్‌లో ఆయన గురువారం బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లాడుతూ ఆదివారం వరంగల్‌లోని ఎల్కతుర్తిలోజరగనున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలోను విఫలమైందని,బిఆర్ఎస్ హయాంలోనే పాతనగరం ఎంతగానో అభివృద్ధి సాధించిందని ఆయన తెలిపారు.

## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

**చార్మినార్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, ఉగ్రవాదుల దాడిని కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ ఖండించారు.కిషన్‌బాగ్‌లో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులు అమాయక ప్రజలను చంపటం చాలా దారుణమైన విషయమని, ఉగ్రవాదులను గుర్తించి కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని తెలిపారు.ఉగ్రదాడి జరగటం చాలా బాధాకరమని,దేశంలోని ప్రతీ ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని ఆయన తెలియజేశారు.

## అడ్మిషన్ల పేరిట లక్షలు వసూలు చేస్తున్న కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఎబివిపి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎబివిపి ఆందోళనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

**బేగంబజార్,ఏప్రిల్ 24ప్రభాతవార్త:** అడిష్మన్ల పేరిట లక్షలకు, లక్షలు ముందే వసూలు చేస్తున్న కళాశాలపైన వెంటనేచర్యలు తీసుకోవాలని ఎబివిపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ఈమేరకు గురువారం నాంపల్లి ఇంటర్‌మీడ్మియేట్‌బోర్డు కార్యాలయం ముందు ఎబివిపి ఆద్వర్యంలో పెద్దఎత్తున్న ఆందోళన చేశారు.కార్యాలయం లోపలికి చొచ్చుకు పోయేందుకు ప్రయత్నించిన ఎబివిపి విద్యార్ది సంఘాల ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకుని ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఇంటర్ మీడియట్ అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలని డిమాండ్ చేశారు.నోటిఫికేషన్ విడుదల చేశారు.బోర్డు నియమ,నిబంధనలకు విరుద్దంగా ఫీజులు వసూలు చేస్తున్నారని,బోర్డు నిబంధనలకు వ్యతిరేకంగా ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న కళాశాలపైన చర్యలు తీసుకోవాలన్నారు.నిరసన వ్యక్తం చేశారు.పోలీసులకు విద్యార్దులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.అసలు విద్యా సంవత్సరంప్రారంభం కాక ముందే ఎలా అడిష్మన్లు తీసుకుంటారన్నారు. కళాశాల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్నారు. కళాశాలపై చర్యలు తీసుకోక పోతే ఆందోళన ఉదృత్తం చేస్తామన్నా రు.పోలీసులకు,విద్యార్దులకు వాగ్వివాదం చోటు చేసుకుంది. ఎట్టకే లకు పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళన కారులను అరెస్ట్ చేసి తీసుకువెళ్లారు.నలువైపుల్లా ట్రాఫిక్ జాం చోటు చేసుకుంది.

## మౌలిక సదుపాయాలు కల్పించండి విద్యార్థినుల ఆందోళన

**అఫ్జల్‌గంజ్,ఏప్రిల్ 24ప్రభాతవార్త:** కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో వసతి గృహంలో మౌలిక సదుపాయాలు లేవంటూ విద్యార్దినులు పెద్ద ఎత్తున్న ఆందోళన చేశారు.గురువారం ఉపకులపతిచాంబర్ ముందు విద్యార్దినులు ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. హాస్టల్‌లో మంచినీరు, మరుగుదొడ్లు,సరిగాలేవని,క్యాంపస్‌లో పాములు తిరుగుతున్నాయని,ఎలుకలు ఉన్నాయన్నారు. కుక్కలు సంచరిస్తున్నట్లు విద్యార్దినులువాపోయారు.పలుసార్లు ఉపకులపతికి విన్నవించినప్పటికి ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. సమస్యలనుపరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు చెప్పారు.లేనిపక్షంలో ఆందోళన ఉదృత్తం చేస్తామన్నారు.

# పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు



పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న తెలంగాణ న్యాయవాదులు



పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళ్లు అర్పిస్తున్న టి.ఎన్.జి.ఓ.ప్రతినిధులు



ఎంజీ రోడ్డు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద పాకిస్థాన్ ఉగ్రమూకల దాడిలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు.



నిరసన వ్యక్తం చేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో ..**

**ముషీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఉగ్రవాదాన్ని నిర్మూలించటంలో కేంద్ర ప్రభుత్వానికి భారత ప్రజలందరూ అండగా నిలబడాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో తెలంగాణ న్యాయవాదులు కాశ్మీర్‌లోని పెహల్గాం లో ఈనెల 22న జరిగిన తీవ్రవాద కార్యకలాపాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉపేంద్ర రామ చంద్రరావు, సత్యనారాయణరెడ్డి, విప్లవరెడ్డి, ప్రదీప్, నరేష్, రాజేశ్వరరావు, చంద్రశేఖర్, బాల్‌రెడ్డి మరియు ఇతర సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

**తెలంగాణ నాన్ గజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ...**

**గన్‌ఫౌండ్రి,ఏప్రిల్ 24ప్రభాతవార్త:** జమ్ముకాశ్మీర్ పహల్గామ్ జిల్లాలో అమాయక ప్రజలపైన తీవ్ర వాదులు దాడిచేసి 28 ప్రాణాలను బలిగొన్న ఘటనను నిరసిస్తూ తెలంగాణ నాన్ గజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ కార్యాలయంలో మృత్యులకు నివాళ్లు అర్పించారు.తెలంగాణ నాన్‌గజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర సంఘంప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ మాట్లాడుతూ జమ్ముకాశ్మీర్‌ను విక్షేచెందుకు వచ్చిన అమాయకప్రజలపై ఉగ్రవాదులు దాడులు చేసి ప్రాణాలు తీయడం పిరికి పందల చర్య అన్నారు. మరణించిన వారందరికి తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలోటిఎన్‌జిఓ ప్రతినిధులు గీతారాణి,ఖాలేద్ అహ్మద్,శ్రీదేవి,రాజు,సత్యనారాయణ,ఖలీమ్,సుదర్శన్‌గౌడ్ ,వరప్రసాద్,మహేందర్,శ్రీనివాస్,మురారీరోగేష్,ముఖీంఖరేషీ తదితరులు పాల్గొన్నారు.

**రాంగోపాల్‌పేట డివిజన్‌లో**

**బేగంపేట ఏప్రిల్ 24,ప్రభాతవార్త :** జమ్మూ కాశ్మీర్ లో పాకిస్థాన్ ఉగ్రమూకలు భారతీయులపై జరిపిన దాడిలో అనేక మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు.వారి మృతికి సంతాపం తెలియజేస్తూ సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ నేతృత్వంలో సనత్ నగర్ నియోజకవర్గం ఏ బ్లాకు అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం రాంగోపాల్‌పేట డివిజన్ ఎంజీ రోడ్డు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఉగ్ర మూకల దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారతీయుల చిత్ర పటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలియజేసారు.వారి చిత్ర పటాల వద్ద నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా త్రికాల మనోజ్‌కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రమూకల చర్యను ప్రతి భారతీయుడు తీవ్రంగా ఖండించాలన్నారు.ఈ కార్యక్రమంలో త్రికాల మనోజ్‌కుమార్ ముదిరాజ్ తో పాటు పంచముఖి హనుమాన్ ఆలయం ఛైర్మన్ బచ్చు రాజ్‌కుమార్,డిసిసి సెక్రటరీ హేమంత్ ఠాగూర్,రాంగోపాల్‌పేట డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శీలం జయ,ఎస్ ఆర్ శివకుమార్, మహేష్ కుమార్ కఠారి,నాగరాజ్,మాణిక్యం ప్రభు,నజీరుద్దీన్(అడ్డూ) రఘుయాదవ్,వెంకట్,పాండుగౌడ్,నారాయణముదిరాజ్,శ్రీనివాస్‌ముదిరాజ్,శ్రీశైలం,యాసిన్‌కురేసియా,అజర్,హనీఫ్ ఖాన్,కృష్ణ,బబ్లు,అతిక్,ముస్తా తదితరులు పాల్గొన్నారు.

**బోయినపల్లి, బాపూజీనగర్‌లో...**

**కంటోన్మెంట్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** జమ్ముకశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై నిరసన వ్యక్తం చేస్తూ బోయినపల్లి, బాపూజీనగర్, మహాత్మ నగర్, దుబాయ్ గేట్, విష్ణోవి మాత దేవాలయం ప్రాంతాలలో జనం పాకిస్తానుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మరణించిన టూరిస్టులకు సంతాపం తెలుపుతూ భారీ ర్యాలీని నిరవహించారు ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు,శంకర్, రాయల్ కుమార్, రాకేష్, ప్రేముకుమార్ ముదిరాజ్, ఓం యాదవ్, అనిత, సునీత, తులసి ఆనంద్ గౌడ్, అశోక్, అరవింద్, ధాత్రేయ, హిందూ సంఘాలు, వివిధ ఆలయాల పూజారులు పెద్ద సంఖ్యలో పాల్గున్నారు.

**బీఆర్ఎస్ అధ్వర్యంలో...**

జమ్మూ కాశ్మీర్లోని పహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి పొట్టన పెట్టుకోవడం దారుణం, అమాయకులైన ప్రజలపై చేసిన దాడి పిరికిపంద చర్య అని, పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ, ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని వారి కుటుంబాలకు సంఘీభావంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే కంటోన్మెంట్ ఇంచార్జీ మర్రి రాజశేఖర్ రెడ్డి గజ్జెలనగేష్‌తో కలిసి ఎంఎల్ఏ కార్యాలయంలో మౌనం పాటించి అశ్రునివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నివేదిత, మాజీ బోర్డు సభ్యులు మహేశ్వర రెడ్డి, నళిని కిరణ్, పాండు యాదవ్, ప్యారసాని శ్యామ్ కుమార్, భాగ్య శ్రీ, లోకనాథ్, శ్రీనివాస్, నాయకులు కార్యకర్తలు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఓపెన్ యూనివర్సిటీలో కొనసాగుతున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె

## అంబెడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ..సమ్మెకు మాజీ వైస్‌ఛాన్స్‌లర్ మద్దతు



అంబేద్కర్ విగ్రహానికి వినిపత్రం ఇస్తున్న అధ్యక్షులు అవినాష్, ప్రధాన కార్యదర్శి కిశోర్ తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరుతూ గతకొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు గురువారం అంబెడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి ఆర్ అంబెడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా మాజి వైస్ ఛాన్స్ లర్ ప్రొ కే. సీతారామరావు మద్దతు ప్రకటించి కాంట్రాక్టు అధ్యాపకుల న్యాయమైన డిమాండ్ క్రమబద్ధీకరణను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోరారు. ఈసందర్భంగా యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డా. కె. అవినాష్, ప్రధాన కార్యదర్శి డా. ఎం. కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలన్నారు. క్రమబద్ధీకరణ ప్రకియ చేపట్టేలోపు యూజీసీ పే స్కేల్ (బేసిక్, డీ.ఏ, హెచ్ఆర్ఎ, 3 శాతం ఇంక్రిమెంట్) ఇస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో సలహాదారులు డా.కె నర్సింలు, డా. కాసం విజయ్, సంయుక్త కార్యదర్శి డా. పి.రాధాకృష్ణ, కోశాధికారి డా. వై. కుమార్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు డా. మఖ్దూం మొహియుద్దీన్, డా.నాగిళ్ల రామకృష్ణ, కాంట్రాక్టు అధ్యాపకులు డా. పడాల లక్ష్మణ్, డా. సునీల్ కుమార్, డా.విజయ ఉషశ్రీ, డా. సిద్ధాంతి అరుణ, నర్సయ్య భట్టు, డా. కురుమేటి దయాకర్, బి.రాజా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కృషి ప్రతిభ ఎప్పటికైనా గుర్తింపు పొందుతాయి



సంజయ్ కిశోర్‌ను సత్కరిస్తున్న ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఒలేటి పార్వతీశం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** కృషికి ప్రతిభకు ఎప్పటికైనా తప్పక గుర్తింపు లభిస్తుంది అని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు కార్యదక్షునిగా విశేష పరిశోధకునిగా సంజయ్ కిషోర్ సాంస్కృతిక, రచనా రంగాల్లో చేస్తున్న కషి ప్రతిభకు విశ్వవిద్యాలయాలు గుర్తించి గౌరవించే సందర్భం తప్పక రావాలని అయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. గురువారం ప్రముఖ సాంస్కతిక సంస్థ అభినందన నిర్వహణలో సినీ పరిశోధకుడు రచయిత సంగమం ఫౌండేషన్ స్థాపకుడు సంజయ్ కిషోర్ కు చిక్కడపల్లిలోని సంస్థ కార్యలయంలో సత్కార సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వోలేటి పార్వతీశం సంజయ్ సంస్థ పక్షాన సత్కరించి మాట్లాడారు సాంస్కతిక సంస్థలు పుట్ట గొడుగులుగా విస్తరిస్తున్న సందర్భంలో సామా జిక చింత, సాంస్కతిక తపన పడే సంస్థలలో సంగమం అభినందన తొలి స్థానంలో వుంటాయి అన్నారు. సంజయ్ ఎవరికీ పోటీ కాకుండా తనకం టూ ఒక మార్గం వేసుకుని రచయితగా సంస్థ నిర్వహకుడుగా పాతికేళ్ల ప్రస్థానంలో ఎన్నో వైవిధ్య కార్యక్రమాలు నిర్వహించారు అని ప్రశంసించారు. అభినందనలు తెలిపిన ప్రముఖ రచయిత్రిడాక్టర్ శోభా పెరిందేవి మాట్లాడుతూ సంజయ్ సేకరించిన ఫోటోలు సమాచారం పరిశోధక విద్యార్థులు ప్రొఫెసర్స్ ఉపయోగించుకుంటున్నారు అని చెప్పారు. ఆయన సేకరించిన సమాచారానికి విశ్వవిద్యాల యాల గుర్తింపు కావాలని కోరారు.

## స్థానిక సంస్థల పట్ల కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల వివక్ష : చిరంజీవులు



సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఐఎఎస్ అధికారి చిరంజీవులు, సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్‌రాంరెడి తదితరులు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివక్షత చూపుతున్నాయని బీసీ మేధావుల ఫోరం ఛైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. గురువారం మాజీ సర్పంచ్లు, ఎంపిటిసి, జెడ్పిటిసి, కౌన్సలర్, కార్పొరేటర్స్, యూనైటెడ్ ఫోరం, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, ప్రజాసంఘాల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయితీరాజ్ 73, 74 చట్టాలకు జాతీయ హోదా దినోత్సవం సందర్భంగా భవిష్యత్ కార్యాచరణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలో 73,74 సవరణ చేసి స్థానిక సంస్థలకు 29 అధికారలివ్వడం జరిగిందని అన్నారు. అయితే 11 అధికారాలు మాత్రమే ఇచ్చారని కనీసం 20 అధికారాలు ఇచ్చిన కూడా స్థానిక ప్రతినిధులకు గౌరవం దక్కేది అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు,ఎంపీలకు పెన్షన్ ఇస్తున్నట్లుగా వీరికి కూడా పెన్షన్ ఇస్తే బాగుండునని అన్నారు. యూనైటెడ్ ఫోరం అధ్యక్షులు మంచాల వెంకట స్వామి మాట్లాడుతూ స్థానిక సంస్థలకు రావాలసిన పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని, సర్పంచ్, ఎంపిటిసి తదితరులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని బస్ పాసులు, హెల్త్ కార్డులు కల్పించాలని కోరారు.కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్ రామిరెడ్డి, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, యూనైటెడ్ ఫోరం ప్రధాన కార్యదర్శి రాజన్న యాదవ్, కోశాధికారి బైడ్ల భూపతి, సింగరయ్య గౌడ్, అంబటి తులసి, సుభాషిణి, భూపతి, ప్రసాద్, బండ కింద సుందరయ్య గౌడ్ గరిక శ్రీహరి పాల్గొన్నారు.

## బిఎంఎస్ రోజురోజుకు బలపడుతోంది :రాంరెడ్డి



కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

**హైదరాబాద్,ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభాకు అవసరాలకు తగిన విధంగా అభివృద్ధి తో పాటు అత్యవసర సేవలందిస్తున్న జీహెచ్ఎంసీలో రోజురోజుకి భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్ ) బలపడుతుందని బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి అన్నారు. బీఎంఎస్ గుర్తింపు పొందిన భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్‌లో గురువారం పలువురు కార్మిక నేతలు బీఎంఎస్ నేతలు చేరారు. గతంలో బీఎంస్‌లో పని చేసి, ఇతర యూనియన్ లోకి వెళ్లిన గడ్డం శంకర్, బసవపురం సూర్యకుమార్, ముఖేశ్ లు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి. రాజేశ్వరరావు, జనరల్ సెక్రటరీ టి. కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తూర్పు రాంరెడ్డి నేతలకు కుండవాలను కప్పి, యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తూర్పు రాంరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన జీహెచ్ఎంసీ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో పలు సార్లు బీఎంఎస్ అఖండ విజయం సాధించి సాధించి, కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. గడిచిన రెండు దశాబ్దాలుగా బీఎంఎస్ కార్మికులు, ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించి, వారి ప్రయోజనాలను కాపాడిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎం. జాబ్రీ, అడిషనల్ జనరల్ సెక్రటరీ రాధాక్రిష్ణ , ఉపాధ్యక్షులు భిక్షపతి, మహిళా విభాగం నాయకురాలు మనోరమా, గడిపల్లి రూపేశ్, ప్రధాన కార్యాలయం ఇన్ ఛార్జి పవన్ కుమార్, ఖైరతాబాద్ జోన్ కార్యదర్శి ఆర్. వెంకటేశ్, నేతలు రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ చరిత్రలో లింగంగౌడ్ పేరు చిరస్మరణీయం



కార్పొరేటర్ బి.విజయ్‌శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో స్వర్గీయ బి.లింగంగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**

నిరుపేదల పక్షాన రాజీలేని పోరాటంచేస్తూ చివరివరకు వారికి చేదోడు వాదోడుగా నిలిచిన కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మెన్ బి.లింగంగౌడ్ పేరు చిరస్మరణీయమని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్ కొనియాడారు. స్వర్గీయ లింగంగౌడ్ 82వ జయంతి వేడుకలు కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనతరం కుత్బుల్లాపూర్‌లో గల లింగంగౌడ్ ఘాట్‌వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్మెన్‌గా అంతర్జాయ నిధులను సాధించి మౌళికసదుపాయాల కల్పనలో కీలకపాత్ర పోశించారని కొనియాడారు. ఈసందర్భంగా టిఆర్ఎస్ నాయకులు ఒట్టుకూరి బాస్కర్‌గౌడ్, రంగారెడ్డినగర్ డివిజన్ తెలంగాణ రాష్ట్రసమితి అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, యాదిరెడ్డి,, బి.కార్తీక్‌గౌడ్, మొండి ప్రభుదాస్, తేజ, వేణుయాదవ్, రియాజ్, శ్రీనివాస్‌లతో పాటు డివిజన్ నాయకులు, అభిమానులు స్వర్గీయ లింగంగౌడ్ విగ్రహానికిపూల మాలలువేసి నివాళులు అర్పించారు.

## ఉగ్రవాదుల కాల్పులను ఖండించండి .. సుందరయ్య పార్క్ వద్ద క్యాండిల్ ర్యాలీ



బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**

కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద కాల్పులను ఖండిస్తూ వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో గురువారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ ఎదురుగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, ఉగ్రవాదుల క్రూరమైన కాల్పుల్లో మరణించిన పర్యాటకులకు నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాశ్మీర్ లోని పహల్గామ్ యాత్రికుల పైన విచక్షణారహితంగా కాల్పులు జరిపి హతమార్చిన ఉగ్రవాదుల చర్య పిరికి పంద చర్య అని అన్నారు. ఉగ్రవాదులను ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న సంస్థల పట్ల కేంద్రం కఠినంగా వ్యవహరించి ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలని దేశ సమైక్యత సమగ్రత కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రాణ నష్టాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని, కాశ్మీర్లో శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, కోశాధికారి దశరథ్, ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, నాగభూషణం,మురళి కృష్ణ, శైలజ మోహన్, రమేష్ రెడ్డి,ఏ శ్రీనివాస్ రెడ్డి, స్కైలాబ్ బాబు తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు



ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న విశ్వభారతి కళాశాల యాజమాన్యం దృశ్యం

**నార్సింగి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :**

ఇంటర్మీడియట్ పలితాలలో విశ్వభారతి కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపిసికి చెందిన సోఫియాబేగం 470కు 465 మార్కులు, సిరి సంపద 461, నందిన వ453, సిఇసిలో రియా 500లకు 488 మార్కులు, చందన 486, బన్నీ 472, బైపీసీలో ముస్కాన్ పర్వీన్ 440కి గాను 426 మార్కులు సాధించారు. అలాగే సెకండ్ ఇయర్‌లో పి.స్పందన్ కుమార్ 1000కి గాను 991మార్కులు, శ్రీవెన్నెల యాదవ్ 951.మార్కులు సాధించారు. ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విశ్వభారతి కళాశాల యాజమాన్యం మిఠాయిలు తినిపించి, బొకేలు అందించి అభినందించారు. నాణ్యమైన విద్యాను అందించేందుకు విశ్వభారతి కళాశాల లెక్చరర్లు నిత్య విద్యార్థుల వలే కష్టపడుతున్నారన్నారు.

## కెసిఆర్ జాతిపిత కాదు : పిడమర్తి రవి



సమావేశంలో అభివాదం చేస్తున్న పిడమర్తి రవి

**సైఫాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలను, నాయకులను మోసం చేసిన మాజీ సిఎం కెసిఆర్ జాతి పిత కాదని, జ్యూస్ పిత అని తెలంగాణ ఉద్యమకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆయన దొంగ ఆమరణ నిరాహారదీక్ష చేసి తెలంగాణ ఉద్యమ కారులను, తెలంగాణ కోరుకున్న ప్రజలందరిని మోసం చేసి దీక్షను విరమించి జ్యూస్ తాగి దొంగ దీక్ష చేసిన కెసిఆర్ జాతిపిత కాదు జ్యూస్‌పిత అని ఆయన విమర్శించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాడు ఉద్యమ సమయంలో కెసిఆర్ తాను, తన భార్య తప్ప నాకు ఎవరూ లేరని, కొడుకు కెటిఆర్, కూతురు కవిత విదేశాల్లో ఉన్నారని చెప్పి తెలంగాణ ఉద్యమంలోకి తీసుకువచ్చారని ఆరోపించారు. ఈ తెలంగాణ రాష్ట్రం ఉద్యమ కారుల కోసమే అని చెప్పి ఎంతో మంది ఉద్యమకారులను మోసం చేశారని, ఉద్యమకారులు ప్రొఫెసర్ జయశంకర్, గాదె ఇన్నయ్య, ఆలే నరేందర్, జిట్టా బాలకృష్ణారెడ్డి, విజయశాంతి, ఈటల రాజేందర్ తదితరులను మోసం చేశారని ఆయన దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమంలో కెటిఆర్ పాత్ర శూన్యమని, కవిత బంతిపూలతో ఉద్యమం చేస్తే తెలంగాణ రాలేదని, తెలంగాణ ఇచ్చిందని ఎఐసిసి అగ్రనేత సోనియాగాంధీ అని స్పష్టం చేశారు. కవిత వల్ల భారతదేశంలో తెలంగాణ ఆత్మగౌరవం కోల్పోయేలా లిక్కర్ స్కాం చేశారని, ఆమెకు సమాజంలో తిరిగే హక్కు లేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకోవడానికి పిక్కు తినడానికే తోడేళ్ళ గుంపుగా ప్రయతి న్నస్తున్న బిఆర్ఎస్ పార్టీ వజ్రోత్సవ సభకు తెలంగాణ ప్రజలు ఎవరూ వెళ్ళరాదని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు డా.బొమ్మెర స్టాలిన్, బూదాల బాబురావు, రహీం, గుడిపల్లి రవి, బొరెల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్‌లో ఉగ్రవాద దాడిని ఖండిస్తూ నిరసన ర్యాలీ



**అత్తాపూర్ ఏప్రిల్24,ప్రభాతవార్త :**

జమ్ము కాశ్మీర్లో టెర్రరిస్టులు చేసిన మరణ ఖండను నిరసిస్తూ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం అత్తాపూర్ డివిజన్లో నిరసన ర్యాలీ నిర్వహించారు.అనంతరం పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజు భూపాల్ గౌడ్ విచ్చేసి మాట్లాడారు... పాకిస్తాన్ టెర్రరిస్టులు చేసిన మరణకాంతను ఊరికే వదిలిపెట్టమని వచ్చే రోజులలో పాకిస్తాన్‌ను చరిత్ర పుటల్లో నుంచి చర్పేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదర్ పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కొమురయ్య ,బోస్ పల్లి ప్రతాప్ ,అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ ,డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ ,కడెం సుధాకర్ ,జయనంద్ రెడ్డి, విజయ్ కుమార్, కిరణ్ కిట్టు, జి రాజు పి వెంకట్ రెడ్డి ,నల్లింగ్ రమేష్ ,జయ ప్రకాష్ రెడ్డి ,సహదేవ రెడ్డి ,విజయ స్వామి ,శశికాంత్ శర్మ , వాసు ,స్టార్ చిన్న ముఖేష్ బిరోధర్ లకన్ విజయ్ ఉమా అనురాధ అనిల్ గుర్ప్రీసింగ్ పాల్గొన్నారు .

## బోయిన్‌పల్లి కట్టెల దుకాణంలో అగ్నిప్రమాదం -రూ.3 లక్షల ఆస్తినష్టం

**కంటోన్మెంట్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** బాపూజీ నగర్‌లోని ఓ కట్టెల దుకాణం దగ్ధమైన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం యజమాని మోహన్ దుకాణంలో పూజ చేసి దేవుడి ఫొటోల వద్ద దీపం వెలిగించాడు. కొద్ది సేపటికి దుకాణంలో కట్టెలు అంటుకొని బారీ మంటలు చెలరేగాయి, భయాందోళనకు గురైన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి 2 అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. అగ్ని ప్రమాదంలో దాదాపు 3 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని యజమాని మోహన్ తెలిపారు.

## మహేంద్ర సర్వీస్ సెంటర్ లో షార్ట్ సర్క్యూట్.

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

భారీగా మంటలు రెండు కార్లు దగ్ధం.బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రేణుక ఎల్లమ్మ కమాన్ వద్ద ఉన్న మహేంద్ర సర్వీస్ సెంటర్‌లో గురువారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు కార్లు దగ్ధమై విపరీతమైన మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులకు, ఫైర్ ఇంజన్ వారికి స్థానికులు ఫోన్ చేసి చెప్పడంతో హుటాహుటిన స్థానిక బాచుపల్లి పోలీసులు, ఫైర్ ఇంజన్ వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో మహేంద్ర ఎక్స్‌యువి 700 కారు ఒకటి, మహేంద్ర ఎక్స్‌యువి 300 కారు ఒకటి మంటల్లో దగ్ధమయ్యాయి. సంఘటన స్థలాన్ని పరిశీలించిన బాచుపల్లి పోలీసులు షార్ట్ సర్క్యూట్‌వ్ కారణంగానే మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కెసిఆర్ పాలన ఒక సువర్ణ పాలన



బండమైసమ్మ బస్తీలో ఇంటింటి పాదయాత్ర నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నేత వి.శ్రీనివాసరెడ్డి

**ముషీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజలకు ఒక సువర్ణ పాలన అందించారని మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నేత వి.శ్రీనివాసరెడ్డి కొనియాడారు. గురువారం ఆయన కవాడిగూడ డివిజన్‌లోని బండమైసమ్మ బస్తీలో ఇంటింటికి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ నాయకత్వాన్ని బలోపేతం చేయవలసిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. మన లెజండరీ కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ సాధించుకున్నామని, సాధించుకున్న తెలంగాణలో పదిసంవత్సరాల పాటు ప్రజలకు మంచి పాలన అందించి, తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తు చేశారు. ఈనెల 27వ తేదీ వరంగల్‌లో జరగనున్న రజతోత్సవ సభకు ప్రజలందరూ భారీగా తరలివచ్చి, కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు కల్వ గోపి, రేశం మల్లేష్, సిరిగిరి శ్యాం, విఠల్ కాకా, కార్తిక్‌యాదవ్, వెంకటేష్, శివ, మధు, అభి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ



ఛలో వరంగల్ పోస్టర్ విడుదల చేస్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు, మునుకుంట, ఆర్వీ తదితరులు

**గోషామహల్, ఏప్రిల్ 24ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నిర్వహించే ఛలో వరంగల్ కార్యక్రమానికి జాంబాగ్ డివిజన్ బిఆర్ఎస్ పోస్టర్‌ను అంబర్‌పేట శాసనసభ్యులు కాలేరు వెంకటేష్, గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులుమునుకుంట్ల ఆనంద్ కుమార్‌గౌడ్, ఆర్వీమహేందర్‌కుమార్‌లు గోడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలోగోషామహల్ నియోజకవర్గంబిఆర్ఎస్ నాయకులు ప్రియాగుప్త, మాజీ కార్పొరేటర్ రామచంద్రరాజు, జాంబాగ్ డివిజన్ నాయకులు అహ్మద్, జగపతిసాయి, రామన్న, విజయ ముదిరాజ్, భజన్‌సింగ్, నరేష్‌గౌడ్, రవియాదవ్, అస్లాం తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27వ తేదిన వరంగల్‌లో నిర్వహించేబిఆర్ఎస్ బహిరంగసభకు పెద్ద ఎత్తున్న తరలి వెళ్లనున్నట్లు తెలిపారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు : ఎమ్మెల్యే శ్రీగణేష్



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గురువారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 28 మందికి మంజూరైన సిఎం.ఆర్.ఎఫ్.చెక్కులను ఆయన చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి సిఎం రేవంత్ రెడ్డి నృతృత్వంలో అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పేదల కటుంబానికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే సిఎం రేవంత్ రెడ్డి లక్ష్యమన్నారు. అదే విధంగా తన నియోజకవర్గం పరిధిలో తెలంగాణ ప్రజలకు మల్టీ సూపర్ స్పెషల్టీ టిమ్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి : మైచాయస్ సంస్థ



లోహియ నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మై చాయస్ ఆశ్రయం బృందం

**అడ్డగుట్ట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు కుటుంబంలో తలెత్తే విధానాలను, కౌన్సిలింగ్ సేవలు, లీగల్ సర్వీసెస్ వంటి సేవలు అందించేందుకు మై చాయస్ ఫౌండేషన్ పనిచేస్తుందని ఆ సంస్థ హెడ్ ఆఫ్ ఇంటర్‌వెన్షన్ పర్ల్‌చోరగుడి, మోండా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్.డి. నాగేశ్ యాదవ్‌లు తెలిపారు. మై చాయస్ ఫౌండేషన్ ఆశ్రయం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఈస్ట్ మారేడ్‌పల్లి లోహియ నగర్‌లో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌ను వారు ప్రారంభించారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజిషియన్, గైనకాలోజీ, ఆర్తోపెడిక్, డెంటల్, నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించిన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఫర్జానా ఖాన్, మంజూల, విజయ, భవానీ, స్వాతి, సౌమ్య, పుష్పలత, పుష్పారాణి, బావన, వైద్య నిపుణులు డాక్టర్ భక్త సింగ్, డాక్టర్ రాగ చందన, డాక్టర్ సహస్ర, డాక్టర్ మనోజ్ఞ, కాంగ్రెస్ నాయకులు బాబురావు, సోలమన్ పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ..



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

ఎమ్మెల్యే విప్ కేపీ వివేకానంద ఆదేశాల మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ చింతల్‌లో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. 8 మంది లబ్ధిదారులకు రూ.38,5000 సంబంధిత చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుంట సిద్ధి రాములు గంధం సుధాకర్ గౌడ్, గుమ్మడి మధుసూదన్ రాజు, అరుణ రెడ్డి, నదీమ్ రాయ్, ఏసు నరేందర్ రెడ్డి, బలరాం, కుంట వేణు కుమార్, రాజు, చంద్రశేఖర్ రెడ్డి, మురళి గౌడ్ పాల్గొన్నారు.

## అమాయకులపై దాడిచేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం

**ముషీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గాం ప్రాంతంలో అమాయక టూరిస్టులపై దాడిచేసి, 28 మందిని దారుణంగా హత్యచేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్ చేసింది. కాశ్మీర్‌లోని ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేసి, నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.జి.నరసింహారావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఉగ్రవాద దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో పోలీస్ వ్యవస్థ, భద్రత దళాలు కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంటాయని, అయినా ఇటువంటి దాడులను కేంద్రం ఆపలేకపోయిందని విమర్శించారు. మన ఇంటలిజెన్స్ వైఫల్యమే ఈ దాడికి ప్రధాన కారణమని, కేంద్ర తక్షణమే దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీపీఐఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులను తీవ్రంగా ఖండించారు. భారత ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని, ఇక్కడ ఎలాంటి అలజడి జరిగినా ఉగ్రవాదుల కోరికలను నెరవేర్చిన వాళ్లము అవుతామని అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరావు, కే.ఎన్.రాజన్న, ఎం.దశరథ్, కే.నాగలక్ష్మి, నగర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, జె.కుమార స్వామి, ఎన్.మారన్న, పద్మ, వరలక్ష్మి, జి.నరేష్, ఆర్.అశోక్, కే.అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నేత డి.జి.నరసింహారావు

## ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్




జెబిఎస్‌లో ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను అభినందిస్తున్న సత్య సాయి సేవా సంస్థ

**అడ్డగుట్ట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** అన్నిమతాలు, కులాలకన్న మానవత్వమే గొప్పదని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌లు తెలిపారు. శ్రీసత్య సాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్ జెబిఎస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 14వ ఆరాధనోత్సవ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. శ్రీసత్య సాయిబాబా మార్గంలో ప్రతి ఒక్కరు నడుస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నలుగురికి సేవ చేయడం వల్ల మనశాంతి కలుగుతుందన్నారు. ప్రచారం కోసం డబ్బులు ఖర్చు చేస్తే ప్రయోజనం కలుగదన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానం, చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పికెట్ డిపో మేనేజర్ రవిందర్, శ్రీ సత్య సాయి సేవా సంస్థ, ఆదిత్య గ్రూప్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌లు, జిల్లా అధ్యక్షులు సోమసుందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ఉన్న చెట్టు తొలగింపు



సికింద్రాబాద్ ఏఓసి సెంటర్ ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న చెట్టును తొలగించి మరో చోటికి తరలిస్తున్న ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజ్‌తదితరులు

**కంటోన్మెంట్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ ఏఓసి సెంటర్ ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న చెట్టు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నందుకు ఉత్తర మండలి ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజ్ వాటా ఫౌండేషన్ సహకారంతో గురువారం ఏఓసి సెంటర్‌లో ఉన్న చెట్టును కూకటి వేర్లతో తొలగించి మరో చోటకు ఏర్పాటు చేసి వృక్షాన్ని రక్షించారు. పర్యావరణ పరిరక్షణకు కారణం అవుతున్న, భావి తరాలకు ఉపయోగపడే చెట్లను మరో చోటికి షిఫ్ట్ చేసి సురక్షితంగా తరలించడం జరిగిందని ఏసిపి శంకర్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి ట్రాఫిక్ సిఐ ఎల్.మధు బాబు, కంటోన్మెంట్ బోర్డు శానిటరీ సూపరిండెంట్ ఆకుల మహేందర్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీధర్, వాటా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉదయ్ కృష్ణ, సభ్యులు మధన్, మోహిత్ పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమంలో పాలుపంచుకుంటా - కూన శ్రీశైలం గౌడ్



కూన శ్రీశైలం గౌడ్‌కు తమ సమస్యలను తెలుపుతున్న స్థానిక ప్రజలు

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

ప్రజా సంక్షేమంలో పాలుపంచుకుంటానని కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద రోజువారీ కార్యాచరణలో భాగంగా నియోజకవర్గం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ఆహ్వానాలు, వినతి పత్రాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజల సంక్షేమంలో తోడ్పడతానన్నారు. పలు సమస్యలపై వచ్చిన నియోజకవర్గం ప్రజల స్థానిక సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ గుడిలోని సంపులో పడి వ్యక్తి మృతి

**సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి వచ్చిన ఓ వ్యక్తి నీటి సంపులో పడి మృతి చెందాడు. కాచిగూడకు చెందిన బి.బాలాజీ 48, కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లమ్మ ఆలయానికి వచ్చాడు. అక్కడ నీటి సంపులో ఫోన్ పడిపోయింది. ఫోన్ తీసేందుకు ప్రయత్నించగా సంపులో పడిపోయాడు. సిబ్బంది నిచ్చెన సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా బాలాజీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## హన్‌మాన్ దేవాలయం పునర్ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి : కొంతం దీపిక

**కంటోన్మెంట్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** వెస్ట్ మారేడ్‌పల్లి డబుల్‌బెడ్‌రూమ్ వెనుక భాగంలో ఉన్న శ్రీహన్‌మాన్ దేవాలయం పునర్ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. గురువారం ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆమె పర్యవేక్షించారు. ఆలయ పునర్ నిర్మాణానికి గంట రవికుమార్, గంట ఆదర్శ సహకారంతో కొంత వరకు అభివృద్ధి పనులు జరుగు తున్నాయన్నారు.

## 27న ఎకమ్ ఐఎఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సదస్సు



శ్రీలేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** ఎకమ్ ఐఎఎస్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 27న సదస్సు నిర్వహించనున్నట్లు అకాడమి ఫౌండర్ శ్రీలేఖ అబ్బురి తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు 'యుపీఎస్సీ మొదటి ప్రయత్నంలోనే ఎలా క్లియర్ చేయాలి' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అశోక్‌నగర్ చౌరస్తా, కాచంస్ బ్లూ సఫైర్ భవనం రెండవ అంతస్తులోని సంస్థ కార్యాలయంలో జరిగే ఈ సదస్సులో సంస్థలో శిక్షణ పొంది ర్యాంకులు సాధించినవారి అభిప్రాయలు కూడా వెల్లడిస్తారని తెలిపారు. తమ సంస్థలో 75 ర్యాంకులు సాధించడం అకాడమీ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని అన్నారు. సమగ్ర కోచింగ్ పద్ధతులు, నిరంతర పరీక్షలు, వ్యక్తిగత శ్రద్ధ, ప్రత్యేక మార్గదర్శకత్వం ఫలితంగా తమ విద్యార్థులు భారీ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఐఎఎస్, ఐపీఎస్ కావాలనుకునే విద్యార్థులకు ఎకమ్ ఐఎఎస్ అకాడమీ ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు.

## ఘనంగా సత్య సాయిబాబా ఆరాధనోత్సవాలు

**కంటోన్మెంట్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** సత్య సాయి బాబా 14వ అరాధన ఉత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బోయిన్‌పల్లి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యా గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, రిటైర్డ్ జడ్జీ బల రామ్‌గౌడ్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సత్య సాయిబాబా సేవా అధ్యాత్మిక భక్తి కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ క్రిష్ణ మోహన్, రమణారెడ్డి, ఉదయ నారాయణ్, రఘునందన్ రెడ్డి, సంజీవరెడ్డి, నరేందర్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీలతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్ట్ లెడ్ అడ్వర్టైజ్మెంట్ బోర్డుల టెండర్లపై విచారణ జరిపించాలి

**సైఫాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పరిధిలో లెడ్ అడ్వర్టైజ్మెంట్ బోర్డుల ఏర్పాటు కోసం పిలిచిన టెండర్లలో అవకతవకలు జరిగాయని, వీటిపైన విచారణ జరిపించాలని సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి వంద కోట్లు నష్టం వచ్చే విధంగా ప్రైవేటు సంస్థకు లాభం కల్పించేలా నోటిఫైడ్ ఏరియా కమిటీ అధికారుల వ్యవహరించారని పార్టీ ఆరోపించింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ కె.వి.గౌడ్ మాట్లాడుతూ ఆనేక ఆరోపణలు, కోర్టు వివాదంలో ఉన్న నవనిర్మాణ్ అసోసియేట్స్ సంస్థకు తక్కువ ధరకు టెండర్ ఏలాట్ చేశారని, టెండర్ ప్రక్రియలో జతపరిచన డాక్యుమెంట్లలో ఆనేక అంశాలపై అసోసియేట్స్ సంస్థ తప్పుదారి పట్టించే డాక్యుమెంట్లు సమ్మిట్ చేసిందని ఆరోపించారు. తక్షణమే సమగ్రమైన విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

## అద్భుతంగా సాగిన 'రాగాలా సరాగాలా' సినీ సంగీత విభావరి




తనికెళ్ళ సూర్యమీనాక్షిలను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** మీనాక్షి గ్రూప్ ఆబాలగోపాలం ఆధ్వర్యంలో 210వ కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళామారుతి కళావేదికలో నిర్వాహక సంస్థ అధ్యక్షుడు పి.వెంకటేశ్వర రావు, గ్రూప్ వ్యవస్థాపకురాలు తనికెళ్ళ సూర్య మీనాక్షి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సంస్థ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా 'రాగాలా సరాగాలా' పేరుతో అబాలగోపాలం గాయనీ గాయకులచే సంగీత విభావరి కార్యక్రమం అద్భుతంగా సాగింది. గాయనీ గాయకులు వైఎస్.రామకృష్ణ, ప్రభాకర్, చింతలపాటి సురేశ్; రాజేష్, ఆర్.మాధవి, సాయి మేఘన, జ్యోతిర్మయి, మనస్విని గుప్త, ఆద్యా, చైత్ర తదిత రులు అద్భుతంగా గానం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న గాయనీ గాయకులు నిర్వాహకురాలు తనికెళ్ళ సూర్యమీనాక్షిలను ఘనంగా సత్కరించారు.

## ప్రభుత్వ చెరువు కబ్జాపై చర్యలు తీసుకోండి : ఆకుల సతీష్

**నిజాంపేట్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

ప్రభుత్వ చెరువు కబ్జాపై చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. గురువారం బాచుపల్లి గ్రామం, సర్వే నెంబర్ 338 నందు ప్రభుత్వ భూమి, కర్నాల్ కుంట ఆక్రమణ, అక్రమంగా గోడకట్టుకోవడం చదును చేసి స్కూల్ కోసం వాడకంపై 2020లో 338లో 3.21 ఎకరాల విస్తీర్ణం ఉన్న ప్రభుత్వ స్థలం ప్రస్తా భూభారతి వెబ్సైట్లో 2.28 ఎకరాలుగా పేర్కొనడంపై తప్పును సరిదిద్దాలని పూర్తి ఆధారాలతో బాచుపల్లి డిప్యూటీ ఎమ్మార్వోకి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 338, బాచుపల్లిలో నందు కర్నాల్గుంట నందు ఎఫ్‌టిఎల్ నందు 338 కొంత భాగం, సర్వేనెంబర్ 337 భాగంతో 3.675 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉండేది. సర్వేనెంబర్ 338 ప్రభుత్వ భూమి చెరువు ఎఫ్టిఎల్, బఫర్ జోన్ అనుకొని కావ్య కాలనీ హెడా అనుమతితో వెంచర్ ఉన్నది. ఇటీవల కాలంలో కావ్య కాలనీ నందు సూర్య గ్లోబల్ స్కూల్ గ్రౌండ్ కోసం చెరువు ఎఫ్‌టిఎల్, ప్రభుత్వ స్థలం ఆక్రమించుకొని మట్టితో చదును చేయడమే కాకుండా కాంపౌండ్ వాల్ నిర్మాణం కూడా చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూమి, చెరువులైన సర్వేనెంబర్ 338లో ఆక్రమణ, అక్రమ కాంపౌండ్ వాల్ నిర్మాణంపై తక్షిణమే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, సర్వే చేసి ప్రభుత్వ భూమి, ఎఫ్టిఎల్ ఆక్రమించుకున్న సూర్య గ్లోబల్ స్కూల్పై 2020లో ఆర్టిఐ ద్వారా మాకు ఇచ్చిన సమాచారం ప్రకారం సర్వే నెంబర్ 3.21 ఎకరాలు ప్రభుత్వ భూమి నుండి ప్రస్తుతం భూభారతిలో 3.28 ఎకరాలు మాత్రమే కనిపిస్తుందని, ఇదే కబ్జాదారులకి ఆధారంగా చేసుకొని ఆక్రమించుకున్నారని, తక్షణమే ప్రభుత్వ భూమి విస్తీర్ణాన్ని సవరించాలని కోరారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించి ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, ప్రసాద్, చందు, సుధాకర్ రెడ్డి, ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన స్థలం

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన పౌల్ట్రీ రైతులు

**సైఫాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పౌల్ట్రీ రంగ రైతులను ఆదుకుంటామని సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన నేపథ్యంలో పౌల్ట్రీ రంగ రైతులు గురువారం హైదర్‌గూడలోని తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ (టిపిఎఫ్) రాష్ట్ర కార్యాలయం ఎదుట ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది రైతులు పాల్గొని సిఎంను అభినందిస్తు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాసర్లమోహన్‌రెడ్డి, వి.భాస్కర్ మాట్లాడుతూ అంగన్వాడి పథకంలో కోడిగుడ్ల టెండర్‌ను గత కొన్ని సంవత్సరాలుగా మూడు కుటుంబాలు మాత్రమే దక్కించుకుంటున్నాయని ఆరోపించారు. దీంతో రాష్ట్రంలోని 7,500 మంది పౌల్ట్రీ రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 7 జోన్‌లుగా విభజించి టెండర్ ప్రక్రియ జరుపుతున్నారని, ఆ మూడు కుటుంబాలు అధికారులను మేనేజ్ చేస్తున్నాయని, మరికొంత మంది పలు నిబంధనలు పెట్టి అక్రమంగా టెండర్లు పొందుతున్నాయని వారు ఆరోపించారు. ఈ అన్యాయాన్ని సిఎం దృష్టికి తీసుకు వెళ్ళడంతో ఆయన స్పందించి నెల రోజుల పాటు టెండర్ ప్రక్రియను నిలిపివేశారని వారు తెలిపారు. సిఎం టెండర్ ప్రక్రియను సమీక్షించి అందరికి అనుకూలంగా టెండర్లు నిర్వహిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. దీంతో రైతులలో నూతన ఉత్సహం వచ్చిందని ఇందుకు కృతజ్ఞతగా రైతులు సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ, 5 వేల బాయిల్డ్ ఎగ్స్‌ను ప్రజలు, వాహనదారులకు ఉచితంగా పంపిణి చేశా రు. కార్యక్రమంలో ఫెడరేషన్ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారా యణరెడ్డి, ఉపాధ్యక్షుడు వి.నరసింహారెడ్డి, కార్యదర్శి పాతూరి వెంకట్రావు, కోశాధికారి వంగేటి అభిషేక్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.




సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పౌల్ట్రీ రైతులు

## మే 20న గ్రామీణ హర్తాళ్‌ను జయప్రదం చేయాలి

**చిక్కడపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** మే 20న కార్మిక వర్గం తలపెట్టిన బందుకు మద్దతుగా గ్రామీణ హర్తాల్ కు సిద్ధం కావాలని ఎఐఏడబ్ల్యుయు, బికెఎంయు సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడారు. మన వ్యవసాయంలో అత్యంత ముఖ్యమైన ఆహార ధాన్యాల ఉత్పత్తిపై కంపెనీల కన్ను పడిందని, 33 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని విధ్వంసం చేసి విదేశాలకు ఎగుమతి ఆధారిత పంటలకు, అమెరికా ఒత్తిడికి మోడీ ప్రభుత్వం పూర్తిగా లొంగిపోయిందని, . అందుకోసం రైతు పై భారాలు మోపి రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఆహార భద్రతకు ప్రమాదం రాబోతుందని, ఇప్పటికే 10 కోట్ల కుటుంబాలు ఆహార కొరతతో ఇబ్బందులు పడుతుంటే మోడీ ప్రభుత్వం కంపెనీ వ్యవసాయానికి ఆరాటపడుతుందన్నారు. ఉపాధి హామీకి 2.5 లక్షల కోట్ల రూపాయల నిధులను ఇవ్వాల్సి ఉండగా 86 వేల కోట్ల నిధుల తో మోదీ సర్కార్ సరిపుచ్చిందన్నారు. ఆయా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏప్రిల్ 20 నుండి మే 20 వరకు నెల రోజులు దేశ వ్యాప్తంగా ఉద్యమానికి పిలుపునివ్వడం జరిగిందని, రాష్ట్రంలో సరళీకరణ విధానాలు అమలు చేయడం వల్ల కార్మికులు, గ్రామీణ పేదలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మే 20 నాడు జరిగే గ్రామీణ హర్తాళ్, గ్రామీణ బంద్‌లో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సభలో రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట రాములు, బి కే ఎం యు రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య, వృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకులు పైళ్ల ఆశయ, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బాబు సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, డివైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ, బుద్దల జంగయ్య రాష్ట్ర కార్యదర్శి, జె. అంజయ్య రాష్ట్ర సమితి సభ్యులు, ఎస్. లక్ష్మయ్య, రాములుగౌడ్, హజీజ్, యశోద, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పలు డిమాండ్లను ఆమోదించారు. ఆహార భద్రత, ఉపాధి హామీ చట్ట రక్షణ, వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు పోరాడాలి, గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు భూమి పంచి, ఉపాధి అవకాశాలు కల్పించాలి. మన వ్యవసాయాన్ని కబళించటానికి మోడీ మద్దతుతో కంపెనీలు క్యూలు కడుతున్నాయి. మన రాష్ట్రంలో కూడా ఆ దిశగానే అడుగులు పడుతున్నాయి. ఇలాంటి చర్యలకు స్వస్తి పలికి, కంపెనీ వ్యవసాయాన్ని వ్యతిరేకించాలి. ప్రజలకు ఈ విధానాలు అర్థం కాకుండా కేంద్ర ప్రభుత్వం మతోన్మాదాన్ని ప్రేరేపిస్తుంది. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి. హిందూత్వ, మనువాద శక్తుల నుండి రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉంది. రాజ్యాంగ రక్షణకై ఉద్యమించాలి. మోడీ ప్రభుత్వ మద్దతుతోనే దళితులు, మహిళలు ఇతర బలహీన వర్గాలపై దాడులు కొనసాగుతున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు ప్రతిఘటించాలి. మన కార్పొరేటతో వాటాలు పంచుకొని, దేశాన్ని దోచుకోవడానికే ఎలాన్ మస్ మన దేశానికి వస్తున్నాడు, కనుక మస్క్ రాకను వ్యతిరేకిస్తూ, నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. పేదిరిక నిర్మూలనలో కేరళ ప్రభుత్వం చేపట్టిన చర్యలు, మన రాష్ట్రంలో కూడా అలాంటి విధానాల అమలుకు పూనుకోవాలి.




### అన్యాయానికి వ్యతిరేకంగా విజయం సాధించిన కార్మికులకు ఎఐటియుసి అభినందనలు

**సైఫాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** అన్యాయానికి వ్యతిరేకంగా న్యాయస్థానంలో పోరాడి విజయం సాధించిన డిఎఇ కార్మికులకు, దీని అనుబంధ సంస్థ అయిన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ కార్మికులకు ఎఐటియుసి అభినందనలు తెలియజేసింది. కేంద్ర ప్రభుత్వం తన అదీనంలో ఉన్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనీంగ్ ద్వారా కేంద్ర పరిధిలో ఉన్న యూనియన్లను నియంత్రించడానికి యూనియన్‌లలో పనిచేస్తున్న ఆఫీస్ బెరర్లకు రెండు పర్యాయాలు కన్న ఎక్కువ ఏవ్యక్తి సంబంధిత యూనియన్‌లలో ఆఫీస్ బేరర్‌గా ఉండకూడదని చట్ట వ్యతిరేకమన నిబంధనలు ప్రకటించిందని ఎఐటియుసి సీనియర్ నాయకుడు వి.ఎస్.బోస్ ఆరోపించారు. దీంతో యూనియన్‌లు న్యాయం కోసం ముంబాయి హైకోర్టు తలుపు తట్టడం జరిగిందని, ఇరు వర్గాల వాదలను విన్న న్యాయస్థానం యూనియన్‌లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకునే హక్కు లేదని కరాఖండిగా చెప్పిందన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్రం దృష్టిలో పెట్టుకుని కార్మికులహక్కులను హరించి దోపిడీదారులకు సేవ చేసే మార్గాన్ని విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు.


హ్యాపీ బర్త్‌డే



బాబు పేరు : అగస్త్య పిళ్లై
తల్లిదండ్రులు : సుమిత్ , అర్చన

వార్త VAARTHA CLASSIFIEDS

**LOST**

★ I, Y. Praveen S/o Y. Krishna R/o Flat No 203 Block A. Jaswitha Imperial Kondapur RR TG 84 while travelling from Kondapur to Ameerpet I lost my documents Adhaar Card Cheque Books and Passport My Passport bearing name P5070820 date of issue 17-10-2016 and expiry 16-10-2026 contact me at -8885222249.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD.**
**I.A. No. 603 of 2021**
**IN**
**O.S. No.157 of 2020**

**Between:**
Smt. Sangeeta Agarwal ...**Petitioner/ Plaintiff**
**AND**
Smt. Lakshmi Devi and others ... **Respondents /Defendants**
**AND**
M/s. S.V. Refineries Pvt Ltd and another ... **Respondents /Proposed Defendants**

To,
M/s. S.V. Refineries Pvt Ltd, Having its office at Plot no. 268, 4th floor, Sri Krupa Market, Mahaboob Mansion, Malakpet, Hyderabad, Telangana -500036.
Sri Shubam Gupta, S/o. Ravider Kumar Gupta, H.No. 16-11-20/1/25, Saleem Nagar Colony, Malakpet, Hyderabad, T.S.,

Please take notice that the above named Plaintiff have filed the above I.A.No.603 of 2021 IN O.S.No. 157 of 2020 against you and others and the above case is posted to 11-06-2025, for your appearance kindly appear before the above court on the above said date at 10:30 A.M. by person or through a pleader failing which the Hon'ble Court will be decide the matter on merits.

**(BY ORDER OF THE COURT)**
(VISHAL KEDIA)
Advocate
# 3-4-174, Lane Opp. To Ganshyam Patel bhavan, Barkatpura, Hyderabad, T.S-27
**Ph: 9391066568**
Counsel for the Plaintiffs

**IN THE COURT OF MS. CHARU AGGARWAL, JUDGE-1, FAMILY COURTS, WEST DISTRICT, TIS HAZARI COURTS, DELHI.**
SUMMONS/NOTICE FOR SERVICE BY ADVERTISEMENT IN A NEWSPAPER (O.V, R.20)
**HMA NO. 2022/2024**
**Next date of hearing:-26/05/2025**
MUKESH KUMAR ......Petitioner
V/S
CHANDINI ...Respondent
To,
CHANDINI KUMARI W/O SH MUKESH KUMAR D/O GANESH PRASAD R/O 9-1/3, AYODHYA NAGAR, NEAR GOVERNMENT SCHOOL QUTHBULLAPUR, KUTBULLAPUR RANGAFREBBI, HYDERABAD, ANDHRA PRADESH-500055
Whereas (Petitioner) SH. MUKESH KUMAR S/O VIKAU PASWAN has instituted the above suit U/s 13 (1) (ia) OF HINDU MARRIAGE ACT-1955. You are hereby summoned to appear in this court in person or by a pleader on 26.05.2025 at 10.00AM to answer the same, failing which the suit will be disposed of Ex-Parte.
Given under my hand and the seal of the court on **05-04-20025.**
**(CHARU AGGARWAL)**
**Ld. Judge-1, Family Court**
**West District, THC, Delhi.**

## ఉగ్రవాదులు దాడి తీవ్రంగా ఖండిస్తున్నాం

### -ఎమ్మెల్యే అహ్మద్ బలాల



మలక్ పేటలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, నారాయణరెడ్డి తదితరులు

**మలక్ పేట ,ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ అక్బర్ బాగ్ నుంచి మలక్ పేట వరకు ఎమ్మెల్యే బలాల ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, వివిధ మత పెద్దలు, కాలనీ క్షేమ సంఘాల నాయకులు, కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ యాత్రికులపై దాడులు చేయడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సలాం షాహిద్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, నాయకులు అబ్రార్, సైఫుద్దీన్ షఫీ, నారాయణరెడ్డి, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి

### -నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా



రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయిన హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా

**మలక్ పేట ,ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ తో ఆమె భేటి అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు అంశాల గురించి చర్చించారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను ఆధునికరించడానికి చర్యలు చేపడుతున్నామని డైరెక్టర్ మస్రత్ సుల్తానా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కు వివరించారు. రైతులకు మెరుగైన గిట్టుబాటు ధరను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు . రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్యపరిచి సంక్షేమ పథకాలు వారికి అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

## వనస్థలిపురంలో ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన



వనస్థలిపురంలో చేనేత వస్త్ర ప్రదర్శను తిలకిస్తున్న మహిళలు

**వనస్థలిపురం. ఏప్రిల్.24.ప్రభాతవార్త.**

వనస్థలిపురం, హుడా ఓపెన్ ఆడిటోరియంలో గత కొద్దిరోజుల క్రితం ఏర్పాటు చేసిన అల్ ఇండియా చేనేత వస్త్ర ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది. ఈ ప్రదర్శన లో వివిధ ప్రాంతాల నుండి చేనేత కార్మికులు తయారు చేసిన మంగళగిరి, ఉప్పడా,వెంకటగిరి ,బెనారస్ చీరాలతో పాటు,లేడీస్ ఫాన్సీ టాప్స్,డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్,కొండపల్లి బొమ్మలు, వన్ గ్రాం గోల్డ్ ఆభరణాలు, జైపూర్ బెడ్ షీట్స్ అందుబాటులో అతి తక్కువ ధరలకే లభిస్తున్నాయి. ఈ ప్రదర్శన మరి కొన్ని రోజులు మాత్రమే కొనసాగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు.

## రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

### -కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్



**నేరెడ్ మెట్, ఏప్రిల్ 24,ప్రభాతవార్త :** రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్ణీత సమయానికి ప్రజలకు అందుబాటులో ఉంచాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ లో 42 లక్షల రూపాయలతో వేస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె గురువారం పరిశీలించారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, మల్లికార్జున నగర్ కాలనీ ప్రతినిధులు వెంకటయ్య, అచ్యుతారావు, గోపాల్ రెడ్డి సత్యనారాయణ, బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## మీర్‌పేట్‌లో మేడే వాల్ పోస్టర్ ఆవిష్కరణ



మేడే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు అధ్యక్షుడు దాసరి బాబు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలాపూర్ మండల సిఐటియు అధ్యక్షుడు దాసరి బాబు నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 1వ తేదీన జరిగే కార్మిక దినోత్సవం మేడేను కార్మికులందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరిచారి, ధనంజయ్, కార్మికులు బాలకృష్ణ, రాజిరెడ్డి, రాజు, నర్సింహ, నాగరాజు, సిహెచ్ యాదయ్య, ప్రభాకర్, రవి, సత్తయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయాలి



**నేరెడ్ మెట్, ఏప్రిల్ 24ప్రభాతవార్త :** మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లేనందున చెట్టు కింద కూర్చుని ప్రజా సమస్యలు తెలుసుకుంటూ సంబంధిత అధికారులకు తెలియజేస్తూ వినూత్నంగా రెండో రోజు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నిరసన వ్యక్తం చేసారు.గ్రేటర్ హైదరాబాదులోని మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లేకపోవడంతో మల్కాజ్గిరి మున్సిపల్ సర్కిల్ కార్యాలయం వద్ద మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చెట్టు కింద టేబుల్ కుర్చీ వేసుకొని ప్రజలు ఇచ్చే అర్జీలను ప్రజా సమస్యలను తెలుసుకుంటూ , సంబంధిత అధికారులకు తెలియజేస్తూ వినూత్నంగా రెండో రోజు నిరసన వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... ముఖ్యంగా కెసిఆర్ ప్రభుత్వంలో దాదాపు అన్ని నియోజకవర్గాలలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నిర్మించి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ని కలిసి విన్నవించుకునేందుకు ఏర్పాటు చేశారు. కానీ మల్కాజిగిరి నియోజకవర్గం లో ఇంతవరకు క్యాంప్ ఆఫీస్ లేకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే జిహెచ్ఎంసి కమిషనర్ నుండి అడిషనల్ కమిషనర్ (ఎస్టేట్స్) జోనల్ కమిషనర్ నుండి డిప్యూటీ కమిషనర్ తెలియజేయాలని ఈ విధంగా తిప్పుతున్నారు తప్ప పనులు మాత్రం చేయడం లేదు అని అన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే కి ప్రభుత్వ వ్యక్తిగత సహాయకున్ని (పి. ఏ) కేటాయించాలని అసెంబ్లీ సెక్రటరీ, జి ఏ డి, అధికారులకు తెలియజేసిన స్పందన లేకపోవడం అందుకే మల్కాజ్గిరి మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ముందు చెట్టు కింద కూర్చుని రెండో రోజు నిరసన వ్యక్తం చేస్తున్నాము . మల్కాజ్గిరి నియోజకవర్గం ప్రజల సమస్యలు ఎక్కడ ఉంటే ఆ సర్కిల్ కార్యాలయంలో అవసరమైతే కలెక్టర్ గారి కార్యాలయం సమీపంలో కూర్చొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు . ఈ యొక్క కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జెవిసి వెంకన్న , మేకల రాము యాదవ్, మురుగేష్ , శివకుమార్, నవీన్ యాదవ్ , శ్రీనివాస్ గౌడ్, ఉస్మాన్ , సాయి గౌడ్ సుమన్ నవాబ్, రెబ్బ వాసు, దినేష్,శోభ, ఉషశ్రీ, బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదం నశించాలి మానవత్వం పరిమలించాలి సిపిఐ



కుంట్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

**హయత్ నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** జమ్మూకాశ్మీర్ పహల్గాన్ లో టూరిస్ట్ లపై తీవ్రవాదుల జరిపిన దాడిలో మరణించిన వారికి సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల సమితి ఆధ్వర్యంలో రావినారాయణ రెడ్డి కాలనీ లో బుధవారం రాత్రి కోవొత్తుల ర్యాలీ తో అశృనివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి పబ్బతి లక్ష్మణ్ నాయకులు మాట్లాడుతూ మతం పేరు తో దాడులు చేయటం చాలా బాధకరమన్నారు. భారత దేశం లో అన్నిమతాల ప్రజలు స్వేచ్చగా ఉన్నారని ఇది సహించలేని పాకిస్తాన్, బాంగ్లాదేశ్, చైనా లాంటి దేశాల తీవ్రవాదులు భా రత్ పైన దాడులు చేస్తే భారతీయులు సహించేది లేదన్నారు. దేశ రక్షణకోసం బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించి, అవసరం మేరకు ఆర్మీ నియామకాలు చేపట్టాలన్నారు. మరణించిన వారికి సిపిఐ పక్షాన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నమన్నారు. ఈ కార్యక్రమం నాయకులు కేతరాజు నర్సింహ, నవనీత, అరుణ, పుల్లయ్య, యాదగిరి పాల్గొన్నారు. కుంట్లూరు లో... కుంట్లూరులో అఖిల పక్షం ఆధ్వర్యంలో యువకులు బుధవారం రాత్రి కొవత్తు లతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ... పహల్గావ్ లో యత్రికులపై ఉగ్ర వాదుల కాల్పులు దారుణమన్నారు. ఉగ్ర దాడులకు సరైన గుణపాఠం చెప్పాలన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు.

## రామంతాపూర్‌లో కాంగ్రెస్ నేతల కాగడాల ప్రదర్శన



రామంతాపూర్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** కాశ్మీర్‌లోని పహల్గామ్ లో టూరిస్టులపై ఉగ్రదాడిని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉగ్రదాడిని నిరసిస్తూ మృతులకు నివాళి అర్పిస్తూ భారీ ఎత్తున కాగడాల ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్ లోయలో ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఉగ్రమూఖలు చికటిదాడిలో అమాయకులు మృతి చెందారని, మృతుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు. దొంగ దెబ్బ తీసిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు తౌఫిక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్, డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్, సుర్వి మురళీ గౌడ్, వర్కింగ్ ప్రసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, విజయ్ కుమార్, జలీల్‌పాషా, గరిక సుధాకర్, పేట మురళీ, ఉపేందర్‌రెడ్డి, సందీప్, నామ్ రాజిరెడ్డి, సతీష్‌గౌడ్, ముత్యాల బాబు, ముత్యాల జంగయ్య, అజ్మత్ పాషా, బుక్క సురేష్, భాస్కర్, శాగ శ్రీధర్, సచిన్, శంకర్, శోభ, అంబిక, గాయత్రి,నాగమల్లయ్య,స్వామి, షకీల్, లుకాస్, సత్తిరెడ్డి, అరుణ్‌సాయి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను మరణించిన కాంగ్రెస్ : ఎంపి కొండ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించి ఇప్పుడు ఓట్ల రాజకీయం చేస్తుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన చేసిన సేవలను నేటి తరానికి తెలియజేసే బాధ్యత మన అందరి పై ఉందన్నారు.డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షులు రాజభూపాల్‌గౌడ్ ఆదేశాలతో జిల్లా కన్వీనర్ పిట్ట ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తపేటలోని స్పైసిహబ్ హోటల్లో మేధావులు, అద్వకేట్స్, డాక్టర్స్, విద్యావంతులు ,సాఫ్ట్వేర్ నిపుణులతో అంబేద్కర్ జీవిత చరిత్రపై సెమినార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు ఈ తరానికి మార్గదర్శకమని, సమాజంలో సమానత్వాన్ని స్థాపించడంలో ప్రతిఒక్కరూ తమ పాత్రను పోషించాలని, అంబేద్కర్ చూపిన రాజధర్మ మార్గంలో నడవాల్సిందని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ బిజెపి తుంగలో తొక్కిందని విమర్శించారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ నాయకులు పేరాల శేఖర్జీ, అంబేద్కర్ జయంతి ఉత్సవాల కన్వీనర్ తాడూరి శ్రీనివాస్, అందెల శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, వి.ధీరజ్‌రెడ్డి, కొప్పు బాషా, రాములు యాదవ్, బచ్చిగల్లా రమేశ్, కరుణ, వెంకటేష్‌యాదవ్, సంతోష్, శ్రీనివాస్, బుక్క రమేష్, పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌కు వినతి



పనులను పరిశీలిస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** మార్నింగ్‌వాక్ కార్యక్రమంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి గురువారం వివేకానందనగర్‌కాలనీ వాసులతో కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. వివేకానందనగర్ బస్సుస్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ పార్కింగ్ చేయడంతో వివేకానందనగర్‌కు వచ్చే బస్సు కూడా రావటం లేదన్నారు. వెంకటేశ్వరస్వామి దేవాలయం నుండి రామాలయం వరకు పూర్తిగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇబ్బందికరంగామారినా అన్నారు.వర్షాకాలంలో వరద నీటి వల్ల రహదారి పక్కన ఉన్న ఫుట్‌పాత్‌లన్ని డ్యామేజ్ అవుతున్నాయన్నారు. స్ట్రామ్‌వాటర్ నాలాలో పూర్తిగా వర్షపు నీరు నిండిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వివేకానందనగర్ గాంధీ విగ్రహంవద్ద, పానీయ మహావిద్యాలయ స్కూల్ వద్ద చెట్లని మెయిన్ వైర్ల మధ్యలో నుండి ఉండడంతో సమస్య ఏర్పడుతుందని వెంటనే జిహెచ్‌ఎంసి ఆర్టికల్చర్, విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ అధికారులతో సంప్రదించి వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో వివేకానందనగర్‌కాలనీ అధ్యక్షుడు ఎద్దు మోహన్, కాలనీవాసులు సుధాకర్, కిషన్, శ్యామ్, వెంకటేష్, జిహెచ్‌ఎంసి ఎస్‌ఎఫ్‌ఏ యాకయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పహల్గావ్ ఉగ్రవాది దాడి అమానుషం : చిలుక



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న చిలుక ఉపేందర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**

పర్యాటకులపై పహల్గావ్‌లో ఉగ్రవాదులు దాడి చేయడం అమానుషమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పహల్గావ్ లో ఉగ్రవాద దాడిలో అసువులుబాసిన పర్యాటకులకు ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలో చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గావ్ వద్ద జరిగిన ఉగ్రవాద దాడిలో అసువులుబాసిన పర్యాటకులకు అశ్రు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిలుక మాట్లాడుతూ ఉగ్రవాదులు పర్యాటకులపై చేసిన దాడిని పిరికి పందల చర్య అన్నారు. ఉగ్రవాదుల చర్యను ముక్తా కంఠంతో దేశం మొత్తం ఖండిస్తుందన్నారు. భారతదేశంలో విభిన్న మతాలు, కులాలు, భాషల సమూహం ఉన్న కానీ దేశం పైన దాడి జరిగితే దేశం మొత్తం ఏకమై భారత సైన్యానికి నైతిక మద్దతుగా నిలుస్తున్నారు.

## బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలి : కామేష్‌రెడ్డి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భూపాల్‌రెడ్డి, దీప్‌లాల్ చౌహాన్, బీరప్ప, విజయలక్ష్మి తదితరులు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ఈ నెల 27వ తేదీన బి వరంగల్‌లో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి కోరారు. గురువారం జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని మహేశ్వరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను పలువురు పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామేష్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహా సభకు మీర్‌పేట్ కార్పొరేషన్ నుండి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల బీరప్ప, దీప్‌లాల్ చౌహాన్, దిండు భూపేష్‌గౌడ్, జె.శ్రీనివాస్ నాయక్, జమాల్‌పూర్ సునీత బాలరాజ్, పాలపర్తి విజయలక్ష్మి, ఎం.ఎ.రజాక్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిరూర్ బాలరాజ్, యాదిరెడ్డి, మాదరి రమేష్, యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వర్‌చారి, సుర్వి లత శేఖర్ గౌడ్, సాలయ్య, జగాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాం ఉగ్రదాడి మృతులకు బిఆర్ఎస్ నివాళులు



జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులో నివాళులర్పిస్తున్న బిఆర్ఎస్ నేతలు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** కాశ్మీర్ పహల్గాం లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నివాళులర్పించారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులో ముష్కరుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, జిల్లెలగూడ టెంపుల్ మాజీ ధర్మకర్తలు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, చింతపట్ల జ్ఞానేశ్వర్‌చారి, సుర్వి లత శేఖర్‌గౌడ్, నాయకులు దీప్‌లాల్ చౌహాన్, సిద్దాల బీరప్ప, పాలపర్తి విజయలక్ష్మి, దిండు భూపేష్‌గౌడ్, జె.శ్రీనివాస్ నాయక్, ఎం.ఎ. రజాక్,పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,సిరూర్ బాలరాజ్ పాల్గొన్నారు.

## రోహింగ్యాలపై నిఘా పెంచాలి : బిజెపి



ఎమార్వోకు వినతి పత్రం ఇస్తున్న బిజెపి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** శరణార్థుల పేరుతో బాలాపూర్ పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న బర్మా శరణార్థులు రోహింగ్యాలపై నిఘా పెంచి వారు అక్రమంగా పొందిన డాక్యుమెంట్లను గుర్తించి రద్దు చేయాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బాలాపూర్ ఎమ్మార్వో ఇందిరా దేవిని కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోహింగ్యాలు బోగస్ ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు పొంది భారత పౌరుల్లా చెలామణికి ప్రయత్నిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ, పోలీసు శాఖలు విచారణ జరపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపిటిసి ఏనుగు రాంరెడ్డి, సీనియర్ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రేసు నర్సింహారెడ్డి, పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డిలతో పాటు మహేందర్, తిరుమలేష్ పాల్గొన్నారు.

### కరుణశ్రీ సేవా సమితి ఆధ్వర్యంలో మన వారసత్వ సంపద..వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు

**సైదాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** కరుణశ్రీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సైదాబాద్ కృష్ణానగర్ కాలనీలోని కారుణ్య సింధు ఆశ్రమం అరక్షిత బాలుర ఆవాసంలో ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు పది రోజులు, చంద్రాయణగుట్ట కుమ్మరవాడిలోని కారుణ్య భారతినఆశ్రమం అరక్షిత బాలుర ఆవాసంలో ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు ఏడు రోజులు మన వారసత్వ సంపద వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కరుణశ్రీ సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి పూర్తి అయిన విద్యార్థులు ఈ శిక్షణా తరగతులకు హాజరు కావచ్చునని వారు తెలిపారు. నైతిక విలువలు, ఆధ్యాత్మిక విశేషాలు, సమాజసేవ, దేశభక్తి, నీతి నిజాయితీ, ప్రేమ స్నేహము, తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవము పెంపొందించడం, తనకోసం కాకుండా పరులకోసం జీవించడమే గొప్ప అని విద్యార్థులకు తెలియజేయడంతో పాటు భారతీయ ఇతిహాసాలు, చారిత్రక విశిష్టత విషయాలు, రామాయణ, మహాభారత, భాగవత, భగవద్గీత, భారతీయ సంస్కృతి, సంస్కార విషయాలు, ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణ, విద్యా వైజ్ఞానిక విషయాలు, ఆటలు, యోగ, కరాటే, సూర్యనమస్కారాలు తదితర అంశాలను నిపుణులైన వారిచే విద్యార్థులకు నేర్పించబడుతాయని వారు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు సైదాబాద్‌లోని కారుణ్య సింధు ఆశ్రమం, చంద్రాయణగుట్టలోని కారుణ్య భారతి ఆశ్రమంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు.

## బ్యాక్ పిస్ట్ పంచ్‌ల పోటీలలో హంశీ శశ్వత్‌కుమార్ రికార్డు



బ్యాక్ ఫిస్ట్ పంచులు చేస్తున్న కరాటే గురువు హంశీ శశ్వత్‌కుమార్ దృశ్యం.

**ఉప్పల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** హైదరాబాద్‌కు చెందిన కరాటే గురువు హంశీ శశ్వత్‌కుమార్ కేవలం 30 సెకన్లలోనే 281 బ్యాక్‌ఫిస్ట్ పంచ్‌లు చేయడంలో కొత్త రికార్డు సృష్టించారు. గతంలో ఉన్న 268 పంచ్‌ల పూర్వ రికార్డును ఆయన అధిగమించారు. ఈ అద్భుతమైన విజయాన్ని మార్షల్ ఆర్ట్స్‌లో కొత్త మైలు రాయిగా అభివర్ణించారు. సాక్షుల సమక్షంలో సెట్ చేసిన వీడియో ప్రమాణం అందుబాటులో ఉందని, దీని సత్యతను నిర్ధారించేందుకు రికార్డులో అప్‌లోడ్ చేసినట్లు హంశీ శశ్వత్‌కుమార్ అన్నారు. కొత్త ప్రపంచ రికార్డు అనేక సంవత్సరాల కఠిన శ్రమ, అంకితభావం, నిబద్ధత ఫలితం అన్నారు. సాధన వల్లే ఇతరులను వారి పరిమితులను మించడానికి ప్రేరణ పొందాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ రికార్డు ఇప్పటి వరకు గిన్నిస్ రికార్డు కోసం పంపించినట్లు ఆయన తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో స్కంద యాగం



పూజలో పాల్గొన్న నిర్వాహకులు

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**

కొత్తపేట మారుతినగర్‌లోని శ్రీప్రసన్నాంజనేయస్వామి, శ్రీరాజరాజేశ్వరి, శ్రీహరిహరసుతఅయ్యప్పస్వామి వారి దేవాలయంలో స్కందయాగం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య స్కందయాగం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రదక్షణ, విగ్నేశ్వర పూజ, అభిషేకం, పుణ్యాహావచనం, అంకురార్పణ, దీక్షరాదన, మూలమంత్ర జపం, మండప దేవత ఆవాహన, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్టాపన, నీరాజన మంత్రపుష్పములు, స్కంద మూల మంత్ర జపం, విశేష పంచామృత అభిషేకం, మూలమంత్ర ఆహ్వానం, మండప ఆవాహిత దేవతపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్కంద యాగం కార్యక్రమంలో కార్యక్రమంలో పలువురు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిజెవైఎం భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ



ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ, బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు అనుమూల భరత్, జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి, వంజరి వినోద్ కుమార్ తదితరులు

**మలక్ పేట ,ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

కాశ్మీర్ లోని పెహల్ గావ్ లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మలక్ పేట రిలయన్స్ ట్రెండ్స్ నుంచి ముసారాంబాగ్ అంబేద్కర్ విగ్రహం వరకు క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. క్యాండిల్ ర్యాలీలో ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ, భాగ్యనగర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి, భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు అనుముల భరత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంజరి వినోద్ కుమార్ తదితరులు పాల్గొని ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేసి ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన మృతులకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఇది ఒక పిరికిపంద చర్య అని పేర్కొన్నారు. అమాయకులైన యాత్రకులపై దాడి చేయడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాష్ చందర్ జి , రమేష్ రెడ్డి, లింగాలహరి గౌడ్, కొప్పుల దినేష్, యాదగిరి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లను ఆధునికరించడానికి కృషి

### - గ్రేడ్ వన్ కార్యదర్శి చిలుకా నరసింహారెడ్డి



గ్రేడ్ వన్ కార్యదర్శి చిలుకా నరసింహారెడ్డిని సన్మానిస్తున్న వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, ఎస్ జి ఎస్ దామోదర్, ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ తదితరులు

**మలక్ పేట ,ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునికరించడానికి కృషి చేస్తామని గ్రేడ్ వన్ కార్యదర్శి చిలుకా నరసింహారెడ్డి పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్టుకు వచ్చే రైతులు, వ్యాపారస్తులు ,వినియోదారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. అదే విధంగా రైతులకు మంచి మద్దతు ధరను అందించడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వేసవి కాలాన్ని పురస్కరించుకుని మార్కెట్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, ఎస్ జి ఎస్ దామోదర్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేకూరి వెంకటరమణ, మాజీ డైరెక్టర్ మైల రవికాంత్, ఆనియన్ అసోసియేషన్ కోశాధికారి టి. అనిల్ కుమార్ తదితరులు గ్రేడ్ వన్ కార్యదర్శి చిలుకా నరసింహారెడ్డికి పుష్పగుచ్చాలని అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.